అక్రమంగా ఇసుక తవ్వకాలు

- సొసైటీ ఇసుక క్వారీల్లో నిబంధనలు పట్టించుకోని వైనం
- అధికారుల అండతో చెలరేగిపోతున్న అక్రమార్కులు

6



మున్నేరు నుంచి పాలేరుకు
లింక్ కెనాల్

- రూ.162.54 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- గ్రావిటీ ద్వారా వృథాగా వెళుతున్న జలాల మళ్లింపు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- సీఎం, నీటిపారుదల శాఖ మంత్రికి కృతజ్ఞతలు



ఖమ్మం, మే 18 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): వృథాగా వెళుతూ కృష్ణా నదిలో కలుస్తున్న మున్నేరు వృథా జలాలను గ్రావిటీ కెనాల్ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు మళ్లించడానికి మున్నేరు-పాలేరు లింక్ కెనాల్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.162.54కోట్లు విడుదల చేసిందని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి జీవో-98 విడుదలైందని మంత్రి పొంగులేటి తెలిపారు. సముద్రంలోకి వరద నీటిని ఒక్క రూపాయి ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా మళ్లించాలన్న ఆలోచన గత ప్రభుత్వానికి రాలేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో వృథాగా పోతున్న మున్నేరు వరదనీటిలో సుమారు 10టీఎంసీల నీటిని పాలేరు రిజర్వాయర్‌కు మళ్లిస్తామని తెలిపారు. దీనివల్ల రిజర్వాయర్ పరిధిలోని 2.54లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. ఒక్క పాలేరు నియోజకవర్గంలోనే 1.30లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ అవుతుందని పొంగులేటి తెలిపారు. పాలేరు లింక్‌కెనాల్‌కు నిధులు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంత్రి పొంగులేటి కృతజ్ఞతలు తెలిపారు. సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మంజిల్లాకు సాగునీటితోపాటు డోర్నకల్ నియోజకవర్గంలోని పది చెరువులకు సాగునీరు ఇస్తామన్నారు. ఏటా వర్షాకాలంలో వస్తున్న వరదనీరు వృథాకాకుండాదనే సంకల్పంతో మున్నేరు నుంచి పాలేరుకు లింక్‌కెనాల్‌ను రూపకల్పన చేసి మంజూరుచేసినట్లు తెలిపారు. నిర్దేశించిన గడువులోగా ప్రాజెక్టును పూర్తిచేసి మున్నేరు జలాలను పాలేరు రిజర్వాయర్‌కు అందించి సాగర్ ఆయకట్టును సస్యశ్యామలం చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు.

వానాకాలం వ్యవసాయ సీజన్ ముంచుకొస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారి అమలుచేస్తున్న యాసంగి రైతు భరోసా సాగు సాయం ఇంకా పూర్తిస్థాయిలో రైతులకు అందలేదు. ఖమ్మం జిల్లాలోని వేలాదిమంది రైతులు 'రైతు భరోసా' కోసం ఎదురు చూస్తున్నారు. మార్చి 31 నాటికి యాసంగి రైతు భరోసా పూర్తిస్థాయిలో చెల్లిస్తామని గతంలో పలువురు మంత్రులు ప్రకటనలు చేసినా.. ఇంతవరకు పూర్తిస్థాయిలో ఎందుకు సాయం అందించలేదని అన్నదాతలు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.



సాగు సాయమేదీ?

- గడువు ముగిసినా పూర్తిగా అందని 'రైతు భరోసా'
- వానాకాలం సీజన్ వస్తున్నా జమకాని నిధులు
- ఖమ్మం జిల్లాలో 62,561మంది రైతులకు అందని సాయం
- చెల్లింపుల్లో తీవ్ర జాప్యంపై అన్నదాతల పెదవి విరుపు

వైరా, మే 18 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వానాకాలం, యాసంగి వ్యవసాయ సీజన్లకు కలిపి ఎకరాకు రూ.పదివేలు పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేశారు. అయితే 2023 నవంబరుకు ముందు రెండు వ్యవసాయ సీజన్లకు ఎకరాకు రూ.15వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందిస్తామని కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. ఎన్నికల సమయంలో యాసంగి సీజన్‌కు సంబంధించి ఎకరాకు రూ.ఐదువేల చొప్పున పెట్టుబడి సాయాన్ని గత ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమచేసేందుకు సిద్ధంకాగా నేటి పాలకులు నాటి ప్రతిపక్ష నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి సాగు సాయం జమచేయకుండా అడ్డుకున్నారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 2023 ఎన్నికల సమయంలో రైతులకు అందాల్సిన పెట్టుబడి సాయాన్ని 2024లో ఎంపీ ఎన్నికల సమయం నాటికి విడతల వారీగా చెల్లించింది. గతేడాది మేలో జరిగిన ఎంపీ ఎన్నికల సమయానికి అష్టకష్టాలు పడుతూ యాసంగి పెట్టుబడి సాయం రూ.ఐదువేల చొప్పున చెల్లించారు.

ఆలస్యమైనా అందని సాయం..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయేతర భూములకు కూడా రైతుబంధు చెల్లించారనే ఆరోపణలు చేస్తూ వ్యవసాయేతర భూములను తొలగించి సాగు చేస్తున్న భూములకు మాత్రమే రైతుబంధు స్థానంలో రైతుభరోసా పేరిట ఏడాదికి రెండు వ్యవసాయ సీజన్లకుగానూ రూ.15వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందిస్తామని కాంగ్రెస్ పాలకులు ప్రకటించారు. ఈ క్రమంలో ఖమ్మంజిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించారు. ఈ ఉపసంఘం మండలస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు రైతుల నుంచి రైతుభరోసా చెల్లింపులపై సలహాలు, సూచనలు స్వీకరించింది. చివరికి ఎకరాలతో నిమిత్తం లేకుండా వ్యవసాయ భూములన్నింటికీ రైతుభరోసా ఇవ్వాలని మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు చేసింది. తాము ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని పక్కకు పెట్టి ఏడాదికి రెండు వ్యవసాయ సీజన్లలో ఎకరాకు రూ.ఆరువేల చొప్పున రూ.12వేలను రైతుభరోసా నుంచి పెట్టుబడి కింద సాయం అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ ఏడాది జనవరి 26న యాసంగి సీజన్‌కు రూ.ఆరువేల చొప్పున రైతుభరోసా పథకాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోని ఒక్కో మండలంలోని ఒక్కో గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ప్రకటించి ఆ గ్రామంలోని రైతులందరికీ రైతుభరోసా చెల్లించారు. ఆ తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరి 5వ తేదీ, 11వ తేదీల్లో రెండు దశల్లో మూడున్నర నుంచి నాలుగున్నర ఎకరాల వరకు భూములున్న రైతులకు రైతు భరోసా చెల్లించారు. అయితే మొదట్లో ఈ రైతుభరోసా సొమ్ములో కూడా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. రెండెకరాల భూమి ఉన్న రైతుకు సర్వేనంబర్ల వారీగా ఎకరం వరకు రైతుభరోసా చెల్లించి మిగిలిన వాటిని నిలిపివేశారు. ఆ సమయంలో 'రైతుభరోసా ఇదేం గోస' అని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించి ప్రభుత్వపరంగా దిద్దుబాటు చర్యలు చేపట్టారు.

గడువు ముగిసినా అందని సాయం

ఖమ్మంజిల్లాలో రైతుభరోసా కింద 3,51,592మంది రైతులు అర్హులు కాగా ఇప్పటివరకు 2,89,039మంది రైతులకు రైతు భరోసా సొమ్ము చెల్లించారు. 3,51,592మంది రైతులకుగానూ రబీ సీజన్‌కు ఎకరా ఒక్కింటికి రూ.ఆరువేల చొప్పున రూ.438,70,31,077 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.259,74,58,369మాత్రమే చెల్లించారు. ఇంకా ఖమ్మం జిల్లాలో రైతుభరోసా కింద 62,561మంది రైతులకు రూ.178,95,72,708కోట్లను నేటికీ చెల్లించలేదు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర మంత్రులు అలాగే ఖమ్మంజిల్లాలో తుమ్మలతోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మార్చి 31నాటికి పూర్తిస్థాయిలో రైతుభరోసా చెల్లిస్తామని ప్రకటనలు చేశారు. అయితే ఇంతవరకు ఆ ప్రకటనలు కార్యరూపం దాల్చలేదు. జూన్ నుంచి ఖరీఫ్ వ్యవసాయ సీజన్ మొదలుకాబోతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18నెలలవుతుంది. రాష్ట్రాన్ని బీఆర్ఎస్ దివాళా తీయించిందని ఇంకా సాకులు చెబుతున్న పాలకులు తాము అధికారంలోకి వచ్చాక మొదటి రైతుభరోసా సాయాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకుండా తమను మభ్యపెడుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సాకులు మాని రైతుభరోసా జమచేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని రైతులు కోరుతున్నారు.

సెల్ వదిలేయ్...
మైదానంలోకి దూకేయ్

- పిల్లల మానసిక ఎదుగుదలపై ఫోన్ గేమ్స్ ప్రభావం
- తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి..
- డీవైఎస్‌వో పరంధామరెడ్డి

4

ప్రశాంతంగా జేఈఈ
అడ్వాన్స్ పరీక్ష

- ఖమ్మం జిల్లాలో 1,357 మంది హాజరు
- 13 మంది గైర్హాజరు



ఖమ్మం ఖానాపురంహవేలి/సుజాతనగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ కాన్పూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ఆదివారం ఖమ్మం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో 6 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1,370మంది విద్యార్థులకు గాను 1357 మంది పరీక్షకు హాజరుకాగా.. 13మంది గైర్హాజరయ్యారు. పేపర్-1 ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2:30గంటల నుంచి సాయంత్రం 5:30గంటల వరకు జరిగింది. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను పరిశీలించిన అనంతరం కేంద్రాల్లోకి అనుమతించారు.

భద్రాద్రి జిల్లాకు సంబంధించి కొత్తగూడెంలోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 120మంది విద్యార్థులకుగాను 118మంది పరీక్షకు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.



ఇల్లెందులో ఆదివాసీల ప్రదర్శన



ప్రసంగిస్తున్న డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్

ఆదివాసీలు హక్కుల కోసం పోరాడాలి

- లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి
- రాజకీయ పార్టీలు తమ వైఖరి తెలపాలి
- ఆదివాసీ హక్కుల పోరాట సమితి జాతీయ నాయకుడు అరుణ్‌కుమార్
- ఇల్లెందులో ఆదివాసీ మహాగర్జన సభ

ఇల్లెందు, మే 18(ఆంధ్రజ్యోతి): లంబాడీలను చట్ట విరుద్ధంగా ఎస్టీలుగా కొనసాగిస్తున్న ప్రభుత్వాలు వెంటనే వారిని ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి జాతీయ నాయకుడు డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై రాజకీయ పార్టీలు తమ వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. భద్రాద్రి జిల్లా ఇల్లెందులో ఆదివారం తుడుందెబ్బ ఆదివాసీ ఉద్యోగ, విద్యార్థి, మహిళ సంఘాల ఆధ్వర్యంలో లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ మహాగర్జన సభ నిర్వహించారు. ఈ సభలో మైపతి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ 48 సంవత్సరాలుగా ఎస్టీ రిజర్వేషన్లలో రాజ్యాంగానికి, చట్టాలకు విరుద్ధంగా లంబాడీలకు ప్రయోజనం కలిగిందన్నారు. రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్‌లో లేని లంబాడీలను ఎలా ఎస్టీలుగా కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. ఆదివాసీల విద్య, ఉద్యోగ హక్కులను లంబాడీలు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ఆదివాసీ ప్రజల గొంతు కాంగ్రెస్ కోసిందని, వారికి తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగిస్తామని ప్రకటించే దమ్ము, ధైర్యం బీఆర్ఎస్, బీజేపీలకు ఉందా అని నిలదీశారు. ఆదివాసీ ప్రజలకు ఓటు చైతన్యం లేదనే కారణంతోనే రాజకీయ పార్టీలు వారికి అన్యాయం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఆదివాసీ ప్రజల ఓట్లతో గెలుపొందిన సీతక్క, కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, రేగా కాంతారావు, పొదెం వీరయ్య, తాటి వెంకటేశ్వర్లు ఎందుకు అసెంబ్లీలో ఆదివాసీలకు జరిగిన అన్యాయాలను ప్రశ్నించలేదని నిలదీశారు.

తెలంగాణ ఉద్యమ కాలంలో ఎమ్మెల్యేలు, ఎంపీల ఇళ్లను ముట్టడించిన తరహాలోనే ఆదివాసీల మనుగడ కోసం, అస్తిత్వం కోసం మళ్లీ పోరాటాలు సాగిస్తామన్నారు. ఈ విషయంపై తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారా లేదా తేల్చుకోవాలని ఆదివాసీ ఎమ్మెల్యేలు, ఎంపీలను ఆయన ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేస్తే ఆదివాసీ ఎమ్మెల్యేలు ఆదివాసీ గిరిజనులకు ఎస్టీ రిజర్వేషన్లలో జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయలేదని ఆయన ధ్వజమెత్తారు. ఆంగ్లేయులు నిజాం పాలనలోనూ మద్రాసు ఉమ్మడి రాష్ట్రంలోనూ లంబాడీలు ఎస్టీలుగా లేరని (మిగతా 4వ పేజీలో)

మూడు నెలల రేషన్
ఒకేసారి!

- కార్డుదారులకు ఇబ్బంది కలగకుండా బియ్యం పంపిణీ
- కసరత్తు చేస్తున్న పౌరసరఫరాలశాఖ అధికారులు



ఖమ్మం కలెక్టరేట్, మే 18(ఆంధ్రజ్యోతి): రేషన్ లబ్ధిదారులకు ప్రభుత్వం మూడు నెలలకు సరిపడా ఒకేసారి సన్న బియ్యాన్ని అందించాలని యోచిస్తోంది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నతాధికారులు ఆయా జిల్లాల పౌరసరఫరాల అధికారులకు ఈ తరహా సన్నాహాలు చేసుకోవాలంటూ మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. రాబోయే మూడు నెలలకు సంబంధించిన బియ్యం కోటా జూన్‌లోనే పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మే నెల బియ్యం పంపిణీ ముగిసిన నేపథ్యంలో జూన్, జూలై, ఆగస్టుకు సంబంధించిన కోటా కూడా ఒకేసారి ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రజలకు, లబ్ధిదారులకు ఇబ్బంది కలగవద్దన్న లక్ష్యంతో సర్కారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఖమ్మం జిల్లాలో 748 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 3,83,717 తెల్ల, 27,268 అంత్యోదయ, 3 అన్నపూర్ణ కార్డుదారులు ఉన్నారు. ఈ కార్డుల ద్వారా ప్రతి నెల జిల్లాలో 6వేల మెట్రిక్ టన్నుల బియ్యం లబ్ధిదారులకు అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడాదికి సరిపడా సన్నబియ్యం నిల్వలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు మూడు నెలలకు ఒకేసారి బియ్యాన్ని (మిగతా 4వ పేజీలో)

భద్రాచలం, మే 18(ఆంధ్రజ్యోతి): గిరిజన సంస్కృతి సంప్రదాయాలను రాబోయే తరాలకు అందించడానికి కృషి చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. భద్రాచలం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆదివారం ప్రపంచ ప్రదర్శనశాలల దినోత్సవం సందర్భంగా కోయవీరగాథ చక్రం, సమ్మక్కసారక్క కథా చక్రంలో భాగంగా వీరుల కథా గాన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో బి.రాహుల్ మాట్లాడుతూ ఆదివాసీ గూడేలలో గిరిజనులపై జరుగుతున్న అన్యాయాలను మొక్కవోని ధైర్యంతో ఎదిరించిన సమ్మక్క సారలమ్మల వలె కాకతీయులను ఎదిరించి వీరమరణం పొందిన ఆదివాసీల ఇలవేల్పులు బాపనమ్మ వెంకటపతిరాజులు, చంద్రపాల వారసులు రుద్రమదేవి పరిపాలన కాలంలో వాడిన ఆయుధాలు, వారి చరిత్రను వీరగాథలుగా మలిచి నేటితరం గిరిజనానికి తెలియజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. పాతతరం గిరిజనుల జీవన శైలి, వ్యవసాయం వారు వాడిన పరికరాలు, పాతతరం ఇళ్ల, (మిగతా 4వ పేజీలో)



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో బి.రాహుల్, వేదికపై ప్రముఖ చరిత్ర పరిశోధకుడు ఆచార్య జయధీర్ తిరుమలరావు

గిరిజన సంస్కృతిని రాబోయే తరాలకు అందించాలి

- భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్
- కోయ వీరగాథ చక్రం ప్రదర్శన
- పాల్గొన్న ప్రముఖ చరిత్ర పరిశోధకుడు ఆచార్య జయధీర్ తిరుమలరావు

మద్యం మరింత ప్రియం

- లిక్కర్ ధరలు పెంచుతూ సర్కార్ ఉత్తర్వులు
- ఇరు జిల్లాల్లో మందుబాబులపై రూ.వందకోట్ల భారం

వైరా, మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్యం ధరలు ప్రభుత్వం పెంచుతూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ధరల పెంపుతో ఉమ్మడి జిల్లాలోని మందుబాబులపై ఏడాదికి రూ.100కోట్లకుపైగా భారం పడనుంది. చీప్ లిక్కర్ మినహా మిగిలిన అన్నిరకాల మద్యానికి ఫుల్‌బాటిల్ ఒక్కింటికి రూ.40 ధర పెంచుతూ మద్యం కంపెనీలకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. క్వార్టర్ బాటిల్‌కు రూ.10, ఆఫ్‌బాటిల్‌కు రూ.20, ఫుల్‌బాటిల్‌కు రూ.40చొప్పున ఈ మద్యం ధరలు పెంచుతూ సర్క్యులర్ జారీ చేసింది. అయితే వైరాలోని ఐఎంఎల్ డిపోకు అధికారికంగా ఈ సర్క్యులర్ ఇంకా అందాల్సి ఉంది. ఖమ్మంజిల్లాకు చెందిన వైరాలోని ఐఎంఎల్ డిపోలో సోమవారం నుంచి సరఫరా చేసే మద్యానికి మాత్రమే పెరిగిన రేట్లు వర్తించనున్నాయి. అప్పటి నుంచే పెరిగిన రేట్లతో వైన్‌షాపులకు ఇన్‌వాయిస్‌ను ఇవ్వనున్నారు. అయితే అకస్మాత్తుగా ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేయడంతో ఇప్పటికే వైన్‌షాపుల్లో ఉన్న మద్యాన్ని కూడా పెరిగిన రేట్లపైనే విక్రయించి కోట్లాది రూపాయల లాభాన్ని దండుకునే మహదావకాశం షాపుల యజమానులకు లభించినట్లయింది.



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వైన్స్, బార్లు, క్లబ్‌లు మొత్తం 263ఉన్నాయి. ఒక్క ఖమ్మంజిల్లాలోనే 122వైన్ షాపులు, 37బార్లు, రెండు క్లబ్‌లు మొత్తం 161, భద్రాద్రి కొత్తగూడెం (మిగతా 4వ పేజీలో)

సాంకేతిక పరిజ్ఞానంతో వివిధ యాప్‌ల నుంచి ఆన్‌లైన్‌లో బాల, బాలికలు ఆడే క్రీడల కన్నా... శారీరక శ్రమతో మైదానాల్లో ఆడే క్రీడలు వ్యాయామంతో పాటు ఒత్తిడిని జయించి ఏకాగ్రతను పెంపొందిస్తాయి. ప్రస్తుతం ఏ ఇంట్లో చూసినా ఒక స్మార్ట్ మొబైల్ ఫోన్ వారి చేతిలో దర్శనమిస్తుంది. ఫోన్ లేదా టాబ్‌లో ఇంటర్నెట్ ప్యాకేజీ లేక ఇంట్లో వైఫై ఉంటే చాలు ఒకే కుటుంబంలో అందరూ ఒకే దగ్గర ఉంటూ ఎవరి ఫోన్‌లో వారు బిజీబిజీ అవుతున్నారు. ఒకరి కొకరు సంబంధాలు లేకుండా తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు.



సెల్ వదిలేయ్...
మైదానంలోకి దూకేయ్

- పిల్లల మానసిక ఎదుగుదలపై ఫోన్ గేమ్స్ ప్రభావం
- సెల్ బాధితుల్లో అధిక సంఖ్యలో బాల, బాలికలు
- తొలిసారి భద్రాద్రి జిల్లాలో 32 వేసవి క్రీడా శిబిరాలు
- తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి..
- డీవైఎస్‌వో పరంధామరెడ్డి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే18 (ఆంధ్రజ్యోతి): సెల్ ఫోన్‌లో క్రీడల వల్ల ముఖ్యంగా పిల్లల్లో మానసిక ఎదుగుదలతోపాటు వారి ఆలోచన విధానంపై తీవ్ర ప్రభావం పడుతుంది. సాధారణంగా ఆ పిల్లలు బయటకు కనిపించిన క్షణాల్లో సైతం ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడిన పద్ధతులనే ఆచరిస్తూ ఊహల్లో ఉండిపోతున్నారు. దీని వల్ల వారు చదువులతో పాటు, మానసికంగా ఎదిగే స్థితి తగ్గిపోవడం వల్ల తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర క్రీడ సాధికారక సంస్థ (సాట్జ్) సహకారంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యువజన క్రీడల కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ వరకు జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు 2025 ఉచితంగా నిర్వహిస్తుండగా వాటిని సద్విని యోగం చేసుకుంటున్నారు. చేతిలో సెల్ వదిలేయ్... మైదానంలోకి ఆటలు ఆడేందుకు పిల్లలు దూకేలా జిల్లా కేంద్రమైన కొత్తగూడెం, అశ్వారావుపేట, ఇల్లెందు, పినపాక, భద్రాచలం ప్రాంతాలలోని మునిసిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక చొరవతో ఉచిత శిక్షణను అందిస్తున్నారు. తల్లిదండ్రులు, సంరక్షకులు సెల్ బాధితులను మైదాన ఆటలు ఆడించేలా ప్రయత్నాలు చేపట్టారు.



తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి : డీవైఎస్‌వో పరంధామరెడ్డి

తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, వారి నడవడికను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలి. వారు మొబైల్ ఫోన్‌లో ఎలాంటి ఆటలు ఆడుతున్నారో గమనిస్తూ ఉండాలి. వారి ప్రవర్తనపై ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ పెట్టి సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండేలా చూడాలి. బాల, బాలికలకు క్రీడలు, సంగీతం, ప్రయాణాలు, డ్రాయింగ్, హిస్టారికల్ - పుస్తకాలు, సినిమాలు వంటి వాటిపై వారి శ్రద్ధను మళ్లించాలి. అదేవిధంగా ఈ వేసవిలో వారికి పౌష్టికాహారాన్ని అందిస్తూ మెడిటేషన్ వంటి తరగతులకు పంపిస్తే వారు చదువులపై ఏకాగ్రతను పెంపొందించుకుంటారు. ఏదైనా ఇష్టమైన క్రీడను ఎంచుకొని శిక్షణ శిబిరంలో చేర్పిస్తే బాగుంటుంది. భవిష్యత్తుకు వేదికగా ఈ వేసవి శిక్షణ శిబిరాలను వినియోగించుకోవచ్చు. తల్లిదండ్రులు, సంరక్షకులు తమ పిల్లల పట్ల జాగ్రత్తలు పాటిస్తే వారు క్రమ శిక్షణతో తప్పకుండా ఉంటారు.

తొలిసారిగా భద్రాద్రి జిల్లాలో 32 శిబిరాలు ...

జిల్లాలో మునిసిపాలిటీ, గ్రామీణ స్థాయిలో ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాలనుసారం డీవైఎస్‌వో పరంధామరెడ్డి పర్యవేక్షణలో ఈ శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ క్రీడల కోసం వివిధ మైదానంలో కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్, క్రికెట్, కరాటే, ఉషు, చెస్, ఆత్యపత్య, రైఫిల్ షూటింగ్, సాఫ్ట్ బాల్, రెజ్లింగ్, తైక్వాండో, వివిధ క్రీడా విభాగాలను 5 నుంచి 14 సంవత్సరాల లోపు వయస్సు గల బాల, బాలికలకు ఉచితంగా తర్ఫీదును అందిస్తున్నారు. ఈ ఏడాది శిక్షణ శిబిరంలో మొత్తం 1650 మంది పాల్గొన్నారు. వారిలో 900 మంది బాలలు, 750 మంది బాలికలు ఉండగా, 32 కోచ్‌లు, 8 మంది అసిస్టెంట్ కోచ్‌లు ఈ క్రీడా శిక్షణ తరగతుల్లో క్రీడాకారులకు మెళకువలను నేర్పిస్తున్నారు. వీరి శిక్షణ తరగతులు ముగిసిన అనంతరం ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి ధ్రువపత్రాలను అందజేయనున్నారు.

ధాన్యం లోడ్ లారీని నిలిపేసిన తహసీల్దార్

- తహసీల్దార్ వెళ్లగానే లారీని పంపేసిన కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి?
- పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న రైతులు

నేలకొండపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): వ్యాపారుల ధాన్యం లారీలో లోడు చేశారని, తమకు నచ్చిన రైతుల కూనవరం 1638రకం ధాన్యాన్ని లోడు చేశారని, మిగిలిన రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని శనివారం నాడు నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్‌లో రైతులు ఆందోళన చేసిన సంగతి పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో ఆందోళనకారుల వద్దకు వచ్చిన తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు రైతులు, హమాలీలు చెప్పిన విషయాలను విన్న అనంతరం లోడు చేసిన లారీని బయటకు పంపవద్దని, ఆదివారం ఉదయం పేపర్లు తనిఖీ చేశాక, అన్ని కరెక్టుగా ఉన్నాయని తేలితే లారీని పంపాలని కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి నవీన్‌ను రైతులు, హమాలీలు, మీడియా ముందు ఆదేశించారు. కానీ తహసీల్దార్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ తహసీల్దార్ మార్కెట్ నుంచి వెళ్లిన అనంతరం లారీ బయటకు వెళ్లింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెల్లవారి మార్కెట్ కార్యాలయ ఆవరణలో లారీ లేక పోవటంతో తహసీల్దార్ ఆదేశాలను కాదని లారీని ఎవరు బయటకు పంపారు అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. అంతే కాకుండా రైతులు, హమాలీలు ఆరోపించినట్లుగా లారీలో నేలకొండపల్లికి చెందిన వ్యాపారికి సంబంధించి సుమారుగా 400టిక్కీల ధాన్యం లోడు చేశారని. కూనవరం 1638 రకం ధాన్యాన్ని లోడు చేశారన్న ఆరోపణలకు బలం చేకూరుతోంది. గతంలో సైతం బోదుల బండకు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధికి చెందిన దాదాపు 2 వేల టిక్కీలను తెచ్చిన వెంటనే కాంటా వేసి లోడు చేసి పంపారనే ఆరోపణలు వచ్చాయి.ఇలాంటి ఆరోపణలు అనేకం వచ్చినా అధికారులు పట్టించుకోలేదని రైతులు ఆరోపించారు. తమ కళ్ల ముందే వ్యాపారుల ధాన్యాన్ని కాంటా వేయటం లోడు చేయటం జరుగుతున్నా, అడిగిన రైతులను బుకాయించారు తప్ప పద్ధతి మార్చుకోలేదన్నారు. శనివారంఆధారాలతో పట్టించినప్పటికీ ఏమాత్రం ఖాతరు చేయకుండా, తహసీల్దార్ ఆదేశాలను సైతం ధిక్కరించి లారీని పంపటంలో అంతర్యమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ సీజన్‌లో మార్కెట్‌లోని డీసీఎమ్మెస్ పీపీసీలో జరిగిన అన్ని లావాదేవీలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

లారీని ఎవరు పంపారు..?

మార్కెట్‌లోని డీసీఎమ్మెస్ పీపీసీలో ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో లారీని బయటకు పంపకుండా నిలిపివేయాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆదేశించినా.. లారీని ఎవరు బయటకు పంపారనేది ప్రశ్నగా మిగిలింది. కాంట్రాక్టు పద్ధతిపై పని చేసే పీపీసీ ఇన్‌చార్జి నవీన్ అంత ధైర్యం చేస్తాడా? నవీన్ వెనకున్నది ఎవరు? అనేది అధికారులు తేల్చాల్సిన అవసరం ఉంది.

లారీ బయటకు వెళ్లింది నాకు తెలియదు

తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు

లారీ మార్కెట్‌లోని డీసీఎమ్మెస్ పీపీసీ నుంచి బయటకు వెళ్లిన విషయం తెలియదు. ఆదివారం ఉదయమే తనకు లారీ బయటకు వెళ్లిన విషయం తెలిసింది. విషయం తెలిసిన వెంటనే సివిల్ సప్లై డీఎంతో మాట్లాడా. కాగితాలను తనిఖీ చేసిన అనంతరమే ధాన్యాన్ని అన్‌లోడ్ చేయించాలని చెప్పా.

కొత్తగూడెంలో ఘనంగా తిరంగా యాత్ర

సైనికులకు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

లక్ష్మీదేవిపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఉగ్ర స్థావరాలను సమయస్ఫూర్తితో మట్టుపెట్టిన భారతీయ సైనికులకు సలాం అంటూ ఆదివారం సాయంత్రం కొత్తగూడెంలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని భారతీయ సైనికుల వీరోచిత పోరాటానికి మద్దతును తెలుపుతూ నినాదాలు చేశారు. ప్రతి ఒక్కరు జాతీయ జెండాను చేతబూని జై జవాన్ అంటూ హోరెత్తించారు. ఈ ర్యాలీ లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డు నుంచి ప్రారంభమై సూపర్‌బజారు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ పాకిస్థాన్ అక్రమిత కశ్మీర్‌ను (పీవోకే) భారత్‌కు అప్పజెప్పడం తప్ప పాకిస్థాన్‌కు ప్రత్యామ్నాయ మార్గం లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు కేవీ. రంగాకిరణ్, జీవీకే. మనోహర్, నాయకులు విద్యాసాగర్, పూర్ణచందర్‌రావు, వేమునూరి శివ, గొడగు శ్రీధర్, పౌరులు, మహిళలు, జాతీయవాదులు తదితరులు పాల్గొన్నారు.



తిరంగయాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు

రామాలయంలో భక్తుల రద్దీ

నాలుగు రోజుల్లో దర్శించుకున్న భక్తులు 37 వేల మంది, రూ.37,42,067 ఆదాయం

భద్రాచలం, మే 18 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. గత నాలుగు రోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశం నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తుండటంతో రామాలయంలో భక్తుల సందడి నెలకొంది. గత నాలుగు రోజుల్లో భద్రాద్రి రామయ్యను సుమారు 37 వేల మంది భక్తులు దర్శించుకోగా రూ.37,42,067 లక్షలకు పైగా ఆదాయం సమకూరింది. ఆదివారం సైతం రామయ్యను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారికి నిర్వహించే నిత్యకల్యాణంలో 93 జంటలు పాల్గొనడం విశేషం. భక్తుల రద్దీ అధికారులు అంచనాలను మించి ఉండటంతో భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ప్రత్యక్ష పర్యవేక్షణలో పరిపాలన అధికారులు సిబ్బంది సైతం భక్తులకు శీఘ్ర దర్శనం కలిగేలా చర్యలు తీసుకున్నారు.


రామాలయంలో భక్తులు

దూసుకొచ్చిన మృత్యువు

- ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఇసుక లారీ
- ఇద్దరు మృతి, మరో ఇద్దరి పరిస్థితి విషమం
- 25 మందికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- తాడ్వాయి జాతీయ రహదారిపై ప్రమాదం
- వనదేవతల దర్శనానికి వచ్చి వెళుతుండగా ఘటన
- బాధితులది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీతారాంపురం గ్రామం



సంఘటన స్థలంలో దుర్గ, సీత మృతదేహాలు



తాడ్వాయి, మే 18 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క - సారమ్మల దర్శనానికి వచ్చిన ఒకే గ్రామానికి చెందిన వారిపై ఇసుక లారీ మృత్యుశకటం రూపంలో దూసుకొచ్చింది. వారు ప్రయాణిస్తున్న వాహనాన్ని వేగంగా ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా పలువురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కుటుంబ సభ్యులతో కలిసి 35మంది ట్రాక్టర్‌లో మేడారం వనదేవతల దర్శనానికి ఆదివారం ఉదయం వచ్చారు. వనదేవతలను దర్శించుకొని భోజనాలు చేసి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో తాడ్వాయి మండలకేంద్రంలో 163 జాతీయ రహదారిపై కూల్‌డ్రింక్స్ తాగడానికి ఓ దుకాణం వద్ద ఆగారు. ఈ క్రమంలో ఏటూరునాగారం వైపు నుంచి వస్తున్న ఇసుక లారీ ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ట్రాలీ 20మీటర్లు ఎగిరిపడడంతో అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందారు. మృతిచెందిన వారిలో ఉప్ప దుర్గ (38), చేతుపల్లి సీత(40) ఉన్నారు. అలాగే చేతుపల్లి సిద్ధు (20), చేతుపల్లి ముత్తమ్మ (45) పరిస్థితి విషమంగా ఉంది. కాగా, ట్రాక్టర్‌లో ప్రయాణిస్తుండగా 25 మందికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను తాడ్వాయి, ములుగు ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. కాగా, లారీ డ్రైవర్ విషయం తెలియాల్సి ఉంది.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఆదివాసీలు హక్కుల కోసం పోరాడాలి

(3వ పేజీ తరువాయి)

ఆయన గుర్తు చేశారు. వర్గీకరణ పేరుతో రాజకీయ పార్టీలు ఆదివాసీ ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు.

ఆదివాసీ ఉద్యోగ సంఘాల నాయకులు పొడియం బాలరాజు మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల పేరుతో ఆదివాసీ ప్రజలను కాల్చి చంపుతున్న నేపథ్యంలో శాంతి చర్చలకు డిమాండ్ చేస్తున్న పార్టీలు 48ఏళ్లుగా తెలంగాణలో ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాలపై ఎందుకు నోరుమెదపడం లేదన్నారు. శాంతి చర్చలకు మేం వ్యతిరేకం కాదని, కానీ తెలుగు రాష్ట్రాల్లో ఆదివాసీలకు రిజర్వేషన్లలో జరుగుతున్న అన్యాయాలను ఎందుకు సరిదిద్దడం లేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఈ తప్పిదాన్ని సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. సభలో ఆదార్ సొసైటీ జాతీయ కన్వీనరు జేజే రాంబాబు, రిటైర్డు ఇంజనీర్ మెట్ల పాపయ్య, ఉద్యోగ సంఘాల నాయకులు తెల్లం వెంకటేశ్వర్లు, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్, ఉద్యోగ సంఘాల నాయకులు గెడెం జనార్ధన్, ఉక్కా రామనాథం, యోగా రామబ్రహం, గుమ్మడి సమ్మయ్య, చాట్ల శ్రీనివాసరావు, ఆరెం పాపారావు, సనప కోటి పాల్గొన్నారు. అంతకు ముందు ఇల్లెందు పట్టణంలో జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ఆదివాసీ ప్రజలు, విద్యావంతులు భారీ ర్యాలీ నిర్వహించారు.


హాజరైన ఆదివాసీలు

తీరనున్న రైతుల కష్టాలు

- బండలరేవు వాగుపై వంతెన నిర్మాణ పనులు ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు


సూరారంలోని బండలరేవు వాగులో వంతెన నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

జూలూరుపాడు, మే 18(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల నుంచి గిరిజన రైతులు పొలాలకు వెళ్లాలంటే వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వచ్చేది. గ్రామంలో నుంచి పొలాలకు వెళ్లే రహదారి మధ్యలో వాగు ఉండటంతో దానిని దాటి పొలాలకు వెళ్లడానికి ఎన్నో అష్టకష్టాలు పడే వారు రైతులు. పొలాలకు వెళ్లిన తర్వాత వర్షం కురిసి వాగు పొంగితే వారు ఇళ్లకు రాలేని పరిస్థితి. ఇలా ఎన్నో ఏళ్లగా ఇబ్బందులు పడుతూ పంటలు సాగు చేపడుతున్నారు. వాగు అవతలి వైపే గిరిజన రైతులకు చెందిన వేలాది ఎకరాల సాగు భూమి ఉంది. వర్షాకాలంలో బిక్కుబిక్కుమంటూ వాగు దాటి పొలాలకు వెళ్లడానికి ఎన్నో అవస్థలకు గురికావాల్సి వస్తుంది. ఇలా ఎన్నో ఏళ్ల నుంచి గిరిజన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక త్వరలోనే వారి కష్టాలు తీరనుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సూరారం గ్రామంలో గిరిజన రైతులకు చెందిన సుమారు 3వేల ఎకరాల భూమి గ్రామసమీపంలోని బండలరేవు వాగు అవతల వైపు ఉంది. వాగుపై వంతెనను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు వాగులో నుంచే తమ పొలాలకు వెళ్లేవారు. వర్షాకాలంలో పొలాలకు వెళ్లడం వారికి భారంగా పరిణమించింది. వాగుపై వంతెన నిర్మించి తమ కష్టాలు తీర్చాలని గిరిజన రైతులు పలుమార్లు ఆందోళనలను నిర్వహించారు. గత కొన్నేళ్లగా అధికారులు, ప్రజాప్రతినిధలను కలసి తమ గ్రామంలోని వాగుపై వంతెన నిర్మించాలని వేడుకున్నారు. దీంతో రెండేళ్ల క్రితం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బండలరేవు వాగుపై వంతెన నిర్మానానికి రూ.70లక్షల నిధులను మంజూరు చేసింది. కాగా గత ఏడాది మార్చి లో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయినప్పటికీ పనులు ప్రారంభానికి నోచుకోకపోవడంతో రైతులు నిరాశ చెందారు.

వంతెన నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఐటీడీఏ పర్యవేక్షణలో పనులు చేపడుతున్నారు. కాగా ఈ వాగుపై వంతెన నిర్మాణంతో ఎన్నో ఏళ్ల నాటి తమ కష్టాలు త్వరలోనే తీరబోతున్నాయని గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రెండు నెలల్లో వంతెన నిర్మాణాన్ని పూర్తిచేస్తాం

● యశ్వంత్ ఐటీడీఏ, ఏఈ



సూరారం గ్రామంలోని బండలరేవు వాగుపై వంతెన నిర్మాణాన్ని రెండు నెలల్లో పూర్తి చేస్తాం. త్వరితగతిన పనులను చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. వీలైనంత త్వరగా పనులను పూర్తిచేసి రైతులకు అసౌకర్యం కలగకుండా చూస్తాం.

మూడు నెలల రేషన్ ఒకేసారి!

(3వ పేజీ తరువాయి)

అందించడానికి ఎలాంటి ఇబ్బంది లేదని చెబుతున్నారు. అయితే రేషన్ దుకాణాలకు ఒక నెల సరుకులు దింపుకోవడానికే స్థలం లేకపోవడంతో ఒకేసారి మూడునెలలకు బియ్యాన్ని దిగుమతి చేసుకోవాలంటే ఆ షాపులు సరిపోయే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో దీనికి ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేస్తారా, ఎలా వీటిని అమలు చేస్తారనే అంశాలపై పౌరసఫరాల అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

ఇంకా ఆదేశాలు రాలేదు : చందన్‌కుమార్, డీఎస్వో

ఖమ్మం జిల్లాలో రేషన్ లబ్ధిదారులకు ఒకేసారి మూడు నెలల బియ్యాన్ని అందించాలన్న అంశంపై మాకు ఇంకా ఆదేశాలు రాలేదు. అయితే ఉన్నతాధికారులు మాత్రం ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా వీడియోకాన్ఫరెన్స్‌లో ఆదేశాలు ఇచ్చారు. దీనికి జిల్లాలో ఉన్న రేషన్ దుకాణాల పరిస్థితిని అంచనా వేస్తున్నాం. అధికారికంగా ఉత్తర్వులు వస్తే అమలు చేయడానికి లబ్ధిదారులకు ఒకేసారి మూడు నెలలకు సరిపడా బియ్యాన్ని అందిస్తాం.

గిరిజన సంస్కృతిని రాబోయే తరాలకు అందించాలి

(3వ పేజీ తరువాయి)

వారి ఇలవేల్పులు, పూజా విధానం, నగలు, గృహోపకరణాలు ఆదరణకు నోచుకోవడంతో వాటిని సేకరించి మ్యూజియంలో పొందుపరిచినట్లు తెలిపారు. అనంతరం కోయ సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చరిత్ర పరిశోధకుడు ఆచార్య జయదీర్ తిరుమలరావు మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రాబోయే తరానికి కోయవీరుల వీరగాథలు కళ్లకు కట్టినట్లుగా చెప్పేలా డాక్యుమెంటరీలను రూపొందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆచార్య జయదీర్ తిరుమలరావును పీవో బి.రాహుల్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తలపతులు బండ్ల మునీశ్వరరావు, గొర్రె బాపనయ్య, బండ్ల చుక్కమ్మ, గొర్రె సత్యం, రాంబాబు, పద్దం అనసూయ, ఆచార్య జి.మనోజ, మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి పాల్గొన్నారు.

మద్యం మరింత ప్రియం

(3వ పేజీ తరువాయి)

జిల్లాలో 88వైన్ షాపులు, 13బార్లు, ఒక క్లబ్ మొత్తం 102ఉన్నాయి. వీటన్నింటికీ వైరాలోని ఐఎంఎల్ డిపో నుంచి ప్రతినెలా 2లక్షల పైచిలుకు మద్యం కేసులను సరఫరా చేస్తున్నారు. వీటిలో సుమారు 30వేల వరకు చీప్ లిక్కర్ మద్యం కేసులు ఉంటాయని అంచనా. ఇంకా మిగిలిన 1.70లక్షల మద్యం కేసులు ఇతర రకాల మద్యానికి చెందినవిగా ఉన్నాయి. చీప్ లిక్కర్‌ను మినహాయించి మిగిలిన రకాల మద్యంపై ప్రతినెలా రూ.8నుంచి రూ.9కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఏడాదికి రూ.వందకోట్లకు పైగానే ప్రభుత్వానికి రాబడి లభిస్తుంది. ఈ మొత్తాన్ని మద్యం బాబుల జేబుల నుంచి చెల్లించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొద్దినెలల కిందటే బీర్ల ధరలు పెంచిన ప్రభుత్వం ఇప్పుడు మద్యం ధరలు కూడా పెంచటంతో మద్యం ప్రియులు నెత్తినోరు బాదుకుంటున్నారు.

నేడు చినఅరుణాచలంలో లింగ ప్రతిష్ఠ

దుమ్ముగూడెం మే 18 (ఆంధ్రజ్యోతి): నరసాపురం చినఅరుణాచలంలో త్రయాహ్నిక ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా సోమవారం 1008 బ్రహ్మసూత్రలింగాల ప్రతిష్ఠ, యంత్రప్రతిష్ఠాపన మహోత్సవం తదితర కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు శివనాగస్వామి తెలిపారు. అనంతరం ప్రాణప్రతిష్ఠా కళాన్యాసము, బింబ గోదర్శనము, బలిహరణ, జయాదులు, పూర్ణాహుతి, పండిత సత్కారము, మహదాశీర్వచనము తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ మహత్తర ఘట్టంలో భక్తులు పాల్గొని కోరారు.

సమయపాలన పాటించని
పంచాయతీ కార్యదర్శులు



కామేపల్లి ఎంపీడీఓ కార్యాలయం

కామేపల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కారం కోసం గత ప్రభుత్వం ప్రతి పంచాయతీకి ఓ పంచాయతీ కార్యదర్శిని నియమించింది. కానీ పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించడంలేదని, ప్రజలకు అందుబాటులో ఉండడంలేదని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కామేపల్లి మండల పరిధిలో 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కానీ కొంత మంది పంచాయతీ కార్యదర్శులు మాత్రం రోజుల తరబడి కార్యాలయాలకు రావడం లేదు. కనీసం కార్యాలయాల తాళాలు కూడా తీయకుండా ఉంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. చాలా మంది ఉదయం 11గంటలకు వచ్చి మధ్యాహ్నం ఒంటిగంటకే పయనమవుతున్నారు. ఎవరైనా సమస్యల కోసం సంప్రదిస్తే కామేపల్లి ఆఫీస్‌లో ఉన్నాం, ఖమ్మం డీపీఓ ఆఫీస్‌లో పని ఉంటే వెళ్లాం అని సాకులు చెప్పుకుంటూ తప్పించుకుంటున్నారని వాపోతున్నారు. గ్రామాల్లో ప్రజా సమస్యలు పరిష్కరానికి కృషి చేయాలని వేడుకుంటున్నారు.

24న వైరాలో మెగా జాబ్‌మేళా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

» ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ వెల్లడి

వైరా, మే 18 (ఆంధ్రజ్యోతి): వైరాలో ఈనెల 24న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ తెలిపారు. ఈ జాబ్‌మేళాను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రారంభిస్తారని వెల్లడించారు. మండలంలోని సిరిపురంలో మాజీ ఎంపీటీసీ మచ్చా వెంకటేశ్వరరావు(బుజ్జి) తోటలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సారథ్యంలో సింగరేణి సంస్థ సహకారంతో ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువతీయువకులు అధిక సంఖ్యలో పాల్గొని ఉద్యోగ ఉపాధి అవకాశాలకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గస్థాయిలో ఇంత పెద్ద ఎత్తున మెగా జాబ్ మేళాను గతంలో ఎన్నడూ నిర్వహించలేదని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, నిరుద్యోగ యువతీయువకుల ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ కార్యదర్శి నూతి సత్యనారాయణ, వైరా, కొణిజర్ల, ఏన్కూరు, కారేపల్లి, జూలూరుపాడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణ, స్వర్ణ నరేందర్, తలారి చంద్రప్రకాష్, మంగీలాల్, నాయకులు మచ్చా బుజ్జీ, బొర్ల గంగారావు, పమ్మి అశోక్ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తవ్వకాలు

» సొసైటీ ఇసుక క్వారీల్లో నిబంధనలు పట్టించుకోని వైనం » అధికారుల అండతో చెలరేగిపోతున్న అక్రమార్కులు

చర్ల, మే 18(ఆంధ్రజ్యోతి): పేదలకు పని కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చర్ల మండలంలో ఇసుక క్వారీలకు అనుమతులిచ్చింది. ఒక్కో ఇసుక క్వారీ నుంచి 90 వేల నుంచి లక్ష క్యూబిక్ మీటర్ల ఇసుక తీసేందుకు ఆదేశాలు జారి చేసింది. ఇసుక మొత్తం గోదావరి నుంచి ట్రాక్టర్ల ద్వారా కూలీలు తరలించాలని సూచించింది. అది కూడా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే గోదావరిలో ఇసుక రవాణా చేయాలి. కానీ చర్ల మండలంలో ప్రారంభమైన ఇసుక క్వారీల్లో రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు కనిపించడం లేదు. ట్రాక్టర్ల స్థానంలో లారీలను రంగంలోకి తీసుకువచ్చి రాత్రి, పగలు లేకుండా ఇష్టా నుసారంగా తోలకాలు జరుపుతున్నారు. ఎవరైనా అనుమతులు ఉన్నాయా అని అడిగితే టీఎస్ఎండీసీ ముఖ్య అధికారి అనుమతులు ఇచ్చారని బాహాటంగా చెబుతున్నారు. ఫలితంగా వందల మంది కూలీలు పనులు లేక పస్తులుంటున్నారు. ప్రభుత్వంతోపాటు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పేదలకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

క్యూబిక్ మీటర్‌కు రూ.220

సొసైటీ ఇసుక క్వారీలో ఒక్క క్యూబిక్ మీటర్ ఇసుక గోదావరి నుంచి ఒడ్డుకు తీసుకువస్తే ప్రభుత్వం రైజింగ్ కాంట్రాక్టర్‌కు రూ.180, సొసైటీ సభ్యులకు రూ. 40 చెల్లిస్తోంది. అంటే లక్ష క్యూబిక్ మీటర్ల ఇసుకను బయటకు తీస్తే ఒక్క కాంట్రాక్టర్‌కు సుమారు రూ.కోటి 80 లక్షల నగదు ను ప్రభుత్వం చెల్లిస్తోందన్న మాట. అలా గే ఎక్కడా కూడా యంత్రాలు, లారీలు వాడకూడదని జీవో విడుదల చేసింది. కానీ చర్ల మండలంలో అవి ఎక్కడా కూడా అమలు కావడం లేదు. సుమారు 6 ఇసుక క్వారీల్లో పట్ట పగలే లారీలతో ఇసుకను డంపింగ్ చేస్తున్నారు. ఇప్పటికే 70శాతం ఇసుకను ఒడ్డుకు చేర్చారు.

ప్రభుత్వం ఇసుక క్వారీకి అనుమతులు ఇచ్చిన దగ్గర నుంచి ఇసుక డంపింగ్, రవాణా, ఆన్‌లైన్ అన్నీ, కొత్తగూడెం జిల్లా టీఎస్ఎండీసీ అధికారులు పర్యవేక్షణ చేయాలి. కానీ మండలంలో ప్రారంభమైన ఇసుక క్వారీల్లో అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. రైజింగ్ కాంట్రాక్టర్లతో మిలాకత్ అయినట్లు ప్రచారం సాగుతోంది. ఈ క్వారీలను పర్యవేక్షణ చేస్తున్న ఓ అధికారి క్యూబిగ్ మీటర్‌కు మూడు రూపాయలు వసూలు చేసి, వారికి అండగా నిలుస్తున్నట్లు ఓ బడా ఇసుక కాంట్రాక్టర్ బాహాటంగా చెబుతున్నాడు. అందుకే యంత్రాలు పెట్టినా, ఎవరైనా ఫిర్యాదు చేసేందుకు ఫోన్ చేసినా ఆయన ఫోన్ ఎత్తడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు కలెక్టర్‌కు కూడా అన్ని తెలుసని భుకాయిస్తున్నారు.

అర్ధరాత్రి క్వారీల్లో ఇసుక రవాణా చేస్తున్న లారీలు తెల్లవారు జామున కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్‌కు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ట్రాక్టర్లు లేకుండా లారీలతో ఇసుక డంపింగ్ దృశ్యం

ఎలాంటి బిల్లులు లేకుండా కేవలం పలుకుబడితో ఈ దందాను సాగిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే లారీ ఆపి డబ్బులు అడిగావు అని పోలీసులకు చెబుతాం అంటూ బెదిరిస్తున్నారని గిరిజనులు చెబుతున్నారు. అలాగే ఇసుక క్వారీల్లో ప్రైవేట్ సైన్యాన్ని పెట్టి, అక్కడికి ఎవరు వెళ్లినా కొట్టించే ప్రయత్నం చేస్తున్నారని చర్చ సాగుతోంది. గిరిజనులు, గిరిజనేతరుల మధ్య తగాదాలు వస్తున్నాయి. కాగా ఇదే విషయం కొత్తగూడెం టీఎస్ఎండీసీ పీవోను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన ఎప్పటి లానే ఫోన్ ఎత్తలేదు.


ట్రాక్టర్ల స్థానంలో లారీల వినియోగం

గోదావరిలో సాయంత్రం ఆరు తరువాత ఎలాంటి వాహనం లారీ వెళ్లడానికి అనుమతులు లేవు. కానీ అధికారులు అండతో పగలు, రాత్రి తేడా లేకుండా పదుల సంఖ్యలో లారీలు, ఎక్స్‌కవేటర్లు పెట్టి ఇసుక రవాణా చేస్తున్నారు. చర్ల మండలంలో సుమారు 6 ఇసుక క్వారీల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుంటే వందల మంది పేదలకు ఉపాధి దొరుకుతుందని వాపోతున్నారు.

సింగరేణిలో ప్రతిభ ఆధారంగానే నియామకాలు

» విజిలెన్స్ జీఎం ప్రసాద్ రావు

రుద్రంపూర్, (సింగరేణి) మే 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ప్రతిభ ఆధారంగానే ఉద్యోగ నియామకాలు జరుగుతాయని, అభ్యర్థులు ఎవరు దళారులను నమ్మి మోసపోవద్దని సింగరేణి విజిలెన్స్ జనరల్ మేనేజర్ కే. ప్రసాద్‌రావు, రిక్రుట్‌మెంట్ జీఎం బెనడిక్ట్ నికోలస్‌లు తెలిపారు. ఆదివారం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో మైనింగ్ గ్రాడ్యుయేట్ ట్రైనీ, జూనియర్ ఆఫీసర్ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం రాత పరీక్షలు నిర్వహించారు. మైనింగ్ గ్రాడ్యుయేట్ ట్రైనీ 35 పోస్టులు ఖాళీగా ఉండగా, 115మంది గాను 102మంది అభ్యర్థులు రాత పరీక్షలకు హాజరయ్యారు. జూనియర్ ఆఫీసర్ (ఎకౌంట్స్) విభాగంలో రెండు పోస్టులకు గాను ఇద్దరు అభ్యర్థులు రాత పరీక్షలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అధికారులు వేణుగోపాల్, ప్రకాశరావు, నాగేశ్వరరావు, రాం బ్రహ్మం, రాంచందర్, జాకీర్ హుస్సేన్, చింత శారద తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన విజిలెన్స్ జీఎం ప్రసాద్ రావు

9 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 18(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 9 ట్రాక్టర్లను ఖమ్మం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. గంధసిరి ఇసుక ర్యాంపు నుంచి నగరంలోకి వస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను రాపర్తినగర్ వంతెన వద్ద, 5 ట్రాక్టర్లను ప్రకాశ్‌నగర్ వంతెన వద్ద పట్టుకున్నారు. ఈ మేరకు ఖమ్మం రెండు, మూడో పట్టణ పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సాంస్కృతికం, మే 18 (ఆంధ్రజ్యోతి): హాసిని రామచంద్ర (హెచ్‌ఆర్‌సీ) లిటరరీ ఫౌండేషన్ 2025 సాహిత్య పురస్కారాలకు రచనలను ఆహ్వానిస్తున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకురాలు తోట సుభాషిణి ఒక ప్రకటనలో తెలిపారు. కవి, రచయతలు గతేడాది నుంచి ఈఏడాది మే నెల వరకు విడుదలైన కథ, కవిత్వ సంపుటాలను జూన్ నెల 15 లోగా తమకు పంపించాలని కోరారు. వచ్చిన పుస్తకాలలోన్యాయ నిర్ణేతల పరిశీలన, ఎంపిక అనంతరం కథ, కవిత్వ విభాగంలో ఒక్కో ఉత్తమ బహుమతిని అందజేస్తామన్నారు. ఉత్తమ కవిత్వ సంపుటికి రూ.5,116, ఉత్తమ కథా సంపుటికి రూ.5,116 తోపాటు జ్ఞాపిక అందజేస్తామన్నారు. కవి, రచయతలు తమ సంపుటాలను నాలుగు ప్రతులు ఇంటినెంబర్ 15-13-309, ఎస్‌బీఐ దగ్గర బ్యాంకు కాలనీ చిరునామాకు పోస్టు ద్వారా పంపాలని కోరారు.

తహసీల్దార్లకు పోస్టింగులు

ఖమ్మం అర్బన్ తహసీల్దార్‌గా సైదులు

ఖమ్మం కలెక్టరేట్, మే 18(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో పలువురు తహసీల్దార్లకు పోస్టింగ్ కల్పిస్తూ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలకు ముందు బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లిన నలుగురు తహసీల్దార్లు శనివారం కలెక్టరేట్‌లో రిపోర్టు చేశారు. వీరందరికీ పోస్టింగులు కల్పించారు. ఖమ్మం అర్బన్ మండలానికి సైదులు, రమాదేవికి బోనకల్, శ్వేతకు రఘునాథపాలెం, ఎస్వీ నారాయణమూర్తికి కల్లూరు ఆర్డీవో ఆఫీస్‌లో డీఏవోగా పోస్టింగ్ కల్పించారు. ఖాసీంషాకు కొణిజర్ల మండలం, ఇప్పటి వరకు ఖమ్మం అర్బన్‌లో పనిచేసిన రవికుమార్‌ను కూసుమంచికి బదిలీ చేశారు. రఘునాథపాలెం మండలంలో పనిచేస్తున్న విల్సన్‌ను తిరుమలాయపాలేనికి బదిలీ చేశారు.



తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సైదులు

కూసుమంచి తహసీల్దార్‌గా రవి

కూసుమంచి, మే 18(ఆంధ్రజ్యోతి): కూసుమంచి తహసీల్దార్‌గా ఖమ్మం అర్బన్ తహసీల్దార్ రవి బదిలీపై రానున్నారు. ఇక్కడ తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న డీటీ కరుణశ్రీని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి అటాచ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వ్యులు జారీ చేశారు.

ఈమేరకు తహసీల్దార్‌గా రవి సోమవారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

అధిక ప్రవేశాలే లక్ష్యం

» ప్రభుత్వ కళాశాలల్లో కార్పొరేట్‌కు ధీటుగా విద్యాబోధన
» ఈ ఏడాది ఇంటర్‌లో మెరుగైన ఫలితాల సాధన
» క్షేత్రస్థాయిలో గ్రామాల్లో అధ్యాపకుల ప్రచారం

కల్లూరు, మే18 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభమయ్యా యి. ఈ క్రమంలో కళాశాల అధ్యాపక బృందం ప్రైవేట్ కళాశాలలకు ధీటుగా గ్రామాలకు తరలివెళ్లి క్షేత్ర స్థాయిలో అడ్మిషన్ల కోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మండు టెండలను సైతం లెక్క చేయకుండా ఈ కళాశాల అధ్యాపకబృందం అడ్మిషన్ల కోసం శ్రమిస్తున్నా రు. అదే స్థాయిలో ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాలు మెరుగైన రీతిలో సాధించడంతో పాటుగా కళాశాలలో విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు పొందడం విశేషం. ఈ కళాశాలలో ఇంటర్ విద్యాబోధనలో అనుభవజ్ఞులైన అధ్యాపక బృదంతో పాటుగా, ఆధునీక వసతి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఇంకాను ఇం టర్ బోధనతో పాటుగా విద్యార్థులకు ఎంసెట్, నీట్ కోర్సులలో ప్రవేశం పొందేలా కళాశాల అధ్యాపకబృందంచే ఉచిత శిక్షణ కూడా ప్రతి ఏడాది ఇస్తున్నారు. దీంతో గతంలో అనేక మం ది విద్యార్థులు ఎంబీబీఎస్, ఇంజనీరింగ్‌లలో ర్యాంకులు పొంది సీట్లు సాధించారు. కళాశాలలో ఆధునీకమైన రీతిలో కళాశాల భవనం, క్రీడా ప్రాంగణం, విశాలమైన ల్యాబ్ సౌకర్యాలు ఉన్నాయి. కళాశాల సమయనంతరం విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ కూడా ఏర్పాటు చేశారు. ఇలా కళాశాల అధ్యాపకబృందం విద్యాబోధనతో ఇంటర్ ఫలితాలు ఆశించిన రీతిలో రావడంతో వారు రెట్టింపు ఉత్సాహంతో అడ్మిషన్ల కోసం గ్రామాలలో గత పక్షం రోజుల నుంచి కరపత్రాలు, బ్యానర్లతో సాధించిన ఫలితాలను ఆధారంగా చూపుతూ ప్రచార కార్యక్రమం చేపట్టారు.

ఇలా క్షేత్రస్థాయిలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల గృహాలను సందర్శించి కళాశాలలో కల్పించే సౌకర్యాలపై అవగాహన కల్పిస్తున్నారు. కళాశాలలో ఇంటర్ ఉచిత విద్యతో పాటుగా అందిస్తున్న పాఠ్య పుస్తకాలు, ఉపకారవేతనాల గురించి కూడా వారు చెబుతున్నారు. ఇంటర్మీడియట్ విద్యాబోధనలో ఆంగ్ల, తెలుగు మీడియంలో ఉంటుందని వివరిస్తున్నారు. ఇలా ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ తాము విద్యాబోధన చేస్తూ విద్యలో రాణించేలా తమ వంతుగా అధ్యాపకులు కృషి చేస్తున్నారు. విద్యార్థుల మానసిక ఉల్లాసానికి క్రీడలు కూడా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కల్లూరు మండల పరిధిలోని పేరువంచ, వెంకటాపురం, నారాయణపురం, చంద్రుపట్ల, కప్పలబంధం తదితర గ్రామాల్లో అధ్యాపకులు ఇంటర్ ప్రథమ అడ్మిషన్లు చేయించారు. తమ కళాశాల ప్రతిభను ఆధారంగా చేసుకొని ఈ ఏడాది పలు గ్రామాల్లో పదవతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రవేశం పొందేందుకు ముం దుకు వస్తున్నట్లు కళాశాల అధ్యాపకులు చెబుతున్నారు.



ప్రచారం చేస్తున్న ప్రభుత్వ అధ్యాపకులు

రాష్ట్రస్థాయిలో ర్యాంకులు...

కల్లూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది ఇంటర్ ప్రథమలో 75 శాతం, ద్వితీయలో 95 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్ర స్థాయిలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో కె. వివేక్ వాసుదేవ్ ఎంపీసీలో 987 మార్కులు, కె.ఉపేందర్ హెచ్ఈసీలో 964 మార్కులు సాధించి ఈ కళాశాల తరుపున రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించారు.

అధ్యాపకుల అండతో ర్యాంకు సాధించా

కె. వివేక్ వాసుదేవ్, రాష్ట్ర స్థాయి ర్యాంకర్



కళాశాలలో అధ్యాపక బృందం చక్కగా విద్యాబోధన చేశారు. వారి ప్రోత్సాహం ఉంది. ప్రత్యేక తరగతులలో పర్యవేక్షణ ఉంది. కళాశాలలో ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందించారు. అధ్యాపకుల బోధనతో పట్టుదలగా ఇంటి వద్ద కష్టపడి చదివి తాను987 మార్కులతో రాష్ట్రస్థాయిర్యాంకు సాధించాను. కళాశాలలో అన్ని విధాలుగా వసతి సౌకర్యాలు ఉన్నాయి. ప్రతిభ వంతులైన అధ్యాపకులచే నాణ్యమైన రీతిలో విద్యను అందిస్తున్నారు. నాతో పాటు మా స్నేహితులు ర్యాంకులు సాధించడం ఆనందంగా ఉంది.

నాణ్యమైన విద్యను అందిస్తాం

● శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ప్రతిభవంతులైన అధ్యాపకబృదం ఉన్నందున నాణ్యమైన విద్యను ఉచితంగా అందిస్తాం. కార్పొరేట్‌కు ధీటుగా వసతి సౌకర్యాలు ఉన్నాయి. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధతో విద్యాబోధన అందిస్తున్నాం. అధ్యాపకుల కృషితో ఈ ఏడాది ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించాం. రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు వచ్చాయి. అన్ని రకాలుగా ఆధునీక వసతి సౌకర్యాలు కల్పించాం. గతంలో కూడా ఎంతో మంది విద్యార్థులు ఎంసెట్, నీట్‌లలో ర్యాంకులు పొందారు.

ఈ ఏడాది కూడా అదే స్థాయిలో విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. కళాశాలలో అధ్యాపక బృదం తలపెట్టిన అడ్మిషన్ల కార్యక్రమానికి గ్రామాలలో తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన ఉంది.

31న ఐటీడీఏ ధర్నాను జయప్రదం చేయండి

భద్రాచలం, మే 18 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఐటీడీఏ ఎదుట ఈ నెల 31న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని గోండ్వాన సంక్షేమపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ తెలిపారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల మంజూరు చేయాలని ఉద్యమాలు చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ మాత్రం ఆదివాసీల ఉద్యమాలను పరిగణలోకి తీసుకోవడం లేదని విమర్శించారు. ఐదో షెడ్యుల్ ఏరియాలో జీవో నెం.3కి అనుగుణంగా వందశాతం రిజర్వేషన్ అమల్లో ఉండి స్థానిక నిరుద్యోగ ఆదివాసీలకు 29 శాఖల్లో నిరుద్యోగ ఆదివాసీలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించారని, ఆ జీవోని కొంత మంది గిరిజనేతరులు జీర్ణించుకోలేని వారు సుప్రీంకోర్టులో కేసు వేసి కొట్టివేయడానికి ప్రధాన భూమిక పోషించారని అన్నారు. ఈ నెల 31న ఐటీడీఏ ఎదుట ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

మణుగూరు టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మణుగూరు మండలంలో జరిగింది. మణుగూరు ఎస్ఐ మేడ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. తోగ్గూడెం గ్రామానికి చెందిన కొమరం ముత్తయ్య(40) అనే వ్యక్తి ఆదివారం సాయంత్రం తోగ్గూడెం గ్రామంలో రోడ్డు దాటుతుండగా అశ్వాపురం నుంచి మణుగూరు వైపు వస్తున్న బొలెరో వాహనం వేగంగా వస్తూ అతడిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ముత్తయ్య అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడు భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతికి కారణం అయిన బొలెరో వాహనం డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

అశ్వాపురంలో...

అశ్వాపురం, మే 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బీజీ కొత్తూరు వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని ఓయువకుడు మృతి చెందాడు. గుర్తు తెలియని యువకుడు(30) ద్వి చక్ర వాహనంపై మణుగూరు నుంచి మొండికుంట వైపు వస్తుండగా, మార్గమధ్యలో బీజీ కొత్తూరు స్టేజీ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ట్రాక్టర్‌ను ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు క్షతగాత్రుడిని 108 అంబులెన్సులో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

గంజాయి వ్యాపారి అరెస్ట్

అశ్వారావుపేట రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటలో ఈనెల 8 న పట్టుబడిన గంజాయికి సంబంధించి గంజాయిని విక్రయించిన వ్యాపారిని ఆదివారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వారావుపేటలో ఈనెల 8న 5.5 కిలోల గంజాయి పట్టుబడగా, ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. నిందితులకు గంజాయిని విక్రయించిన ఒరిస్సా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన రాము అనే వ్యాపారి గంజాయిని విక్రయించాడు. గంజాయి విక్రయించిన వ్యాపారి రాము ఆదివారం అశ్వారావుపేట బస్టాండ్ వద్ద ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి అరెస్ట్ చేశారు. వ్యాపారి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను సీజ్‌చేసినట్లు పోలీసులు తెలిపారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు

తిరుమలాయపాలెం, మే18(ఆంధ్రజ్యోతి): బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎర్రగడ్డ గ్రామంలో నల్లమల నీరణ్‌కుమార్ ఇంటిలో జరిగిన దొంగతనం జరిగింది. కాగా ఈ కేసులో ఇదే గ్రామానికి చెందిన దారమళ్ల సందీప్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా నేరం అంగీకరించి అతని వద్ద ఉన్న జత చెవిదిద్దులు ఇవ్వగా, మిగిలిన బంగారం నెక్లెస్ ఎక్కడని అతడిని అడగ్గా అదే గ్రామానికి చెందిన బెల్లం అభిలాష్‌కు ఇచ్చాడని చెప్పాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. బంగారం నెక్లెస్ నాకు ఇవ్వలేదని నా పేరు ఎందుకు పోలీసులకు చెప్పావని అభిలాష్ సందీప్‌ను బెదిరించడంతో శనివారం సాయంత్రం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తాను క్రిమిసంహారక మందు తాగానని తండ్రి తిరపయ్యకు, పెద్దనాన్నకు సందీప్ సమాచారం అందించాడు.

వెంటనే అతడిని ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. బంగారం నెక్లెస్ గొలుసు ఇవ్వకుండా నీ అంతు చూస్తానని బెదిరింపులకు పాల్పడడంతో నాకుమారుడు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడని బెల్లం అభిలాష్‌పై చర్యలు తీసుకోవాలని సందీప్ తండ్రి స్థానిక పోలీసుస్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగదీష్ తెలిపారు.

ఇల్లెందులో కదం తొక్కిన ఆదివాసీలు

ఇల్లెందు, మే 18 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు పట్టణంలో ఆదివారం ఆదివాసీలు కదం తొక్కారు. రాజ్యాంగ చ ట్టాలకు విరుద్ధంగా లంబాడీలను ఎస్టీ జాబితాలో కొనసాగిస్తున్నారని వెంటనే ప్రభుత్వం తొలగించాలని డిమాండ్ చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన ఆదివాసీ ఉద్యోగులు యువకులు, మహిళలు ప్రదర్శనలో పాల్గొన్నా రు. ప్రదర్శనకు ఆధార్ సొసైటీ జాతీయ కన్వీనర్ జేజే రాంబాబు, ఆదివాసీ ఉద్యోగ సాంస్కృతిక సం క్షేమ సంఘం నాయకులు గేడం జనార్దన్ తెల్లం వెం కటేశ్వరరావు, బుగ్గ రామనాదం, జొగ రామ్‌బ్రహ్మం, వీసాల వుమాదేవి, మెట్ల పాపయ్య, తుడుం దెబ్బ నాయకులు రామకృష్ణ కల్తీ సత్య నారాయణ గొగ్గేల రామస్వామి ఈశాల కృష్ణయ్య పోలెబోయిన వెంకటేశ్వర్లు తదితరులు నాయకత్వం వహించారు.



నృత్యం చేస్తున్న మహిళలు

వేసవి శిక్షణలో విద్యార్థులు

ఇల్లెందు టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోసం వేసవిలో శిక్షణలను నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసి శిక్షణ అందిస్తున్నారు. సింగరేణి ఇల్లెందు ఏరియా ఆధ్వర్యంలో ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, స్విమ్మింగ్ తదితర క్రీడల్లో ప్రతి రోజు ఉదయం 5గంటల నుంచి 8గంటలవరకు సాయంత్రం 4గంటల నుంచి 7గంటల వరకు వారికి శిక్షణను అందిస్తున్నారు. ఇల్లెందు పట్టణంలో జేకేకాలనీ, సింగరేణి పాఠశాల గ్రౌండ్‌లో బాస్కెట్‌బాల్, 24 ఏరియా క్రీడామైదానంలో ఫుట్‌బాల్ శిక్షణకు కోచ్‌లను ఏర్పాటు చేసి అందించడం గమనార్హం. సుమారు 40రోజులపాటు ఈ శిక్షణ ఇచ్చిన అనంతరం సింగరేణి యాజమాన్యం శిక్షణ ధృవీకరణపత్రంతోపాటు స్పోర్ట్‌కీట్లను అందించేందుకు సింగరేణి యాజమాన్యం తగిన చర్యలు చేపట్టింది. శిక్షణ ఇచ్చే కోచ్‌లకు సైతం గౌరవ వేతనాలు అందించనున్నట్లు సింగరేణి అధికారులు ప్రకటించారు.



ఫుట్‌బాల్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు



ఈత శిక్షణ పొందుతున్న విద్యార్థులు

నేడు నగరంలో తిరంగా ర్యాలీ

ఖమ్మం స్పోర్ట్స్, మే 18(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా, భారత త్రివిధ దళాలకు సంఘీభావంగా సోమవారం నగరంలోని లకారం ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించే తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలని తిరంగా యాత్రా కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పార్టీలకతీతంగా జాతీయవాదులు, దేశాభిమానులు ఈ ర్యాలీలో పాల్గొంటారని వారు తెలిపారు. జాతీయ పతాకాలను చేబూని లకారం ట్యాంక్‌బండ్ నుంచి ప్రారంభమయ్యే ఈ ర్యాలీ సర్దార్ పటేల్ స్టేడియం వరకు కొనసాగుతుందని వారు తెలిపారు.



రూరల్ మండలంలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి పొంగులేటి

విద్య, వైద్యంపై సర్కారు నిర్లక్ష్యం

- ఆ రెండింటినీ ప్రజలకు ఉచితంగా అందించాలి
- తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ

నేలకొండపల్లి, మే18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది కొల్లి సత్యనారాయణ విమర్శించారు. నేలకొండపల్లిలోని రావెళ్లభవన్‌లో ఆదివారం నూతక్కి గంగాధరరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని కొల్లి సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం ఏటుకూరి రామారావు అధ్యక్షతన జరిగిన సభలో సత్యనారాయణ



మాట్లాడుతున్న కొల్లి సత్యనారాయణ

మాట్లాడారు. విద్య, వైద్యం ప్రజలకు అందని ద్రాక్షగా మిగులుతున్నాయన్నారు. విద్య, వైద్యం ఖరీదుగా మారిన నేపథ్యంలో ప్రభుత్వాలు ఉదాశీనంగా వ్యవహరించం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. విద్యను, వైద్యాన్ని ప్రజలకు ఉచితంగా అందించే విషయాన్ని ప్రభుత్వాలు ఆలోచించాలని సత్యనారాయణ కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నాణ్యమైన వైద్యం అందని నేపథ్యంలో నూతక్కి గంగాధరరావు ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు.

ఐలమ్మ ట్రస్టు చైర్‌పర్సన్ బుగ్గవీటి సరళ మాట్లాడుతూ మహిళలు, పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే ఇలాంటి వైద్య శిబిరాలు తరచుగా నిర్వహిస్తుండాలని, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్న ఎన్జీఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమన్నారు.

మెగా ఉచిత వైద్య శిబిరంలో మొత్తంగా 322 మందికి వైద్య సేవలందించారు. వైద్యులు ఏటుకూరి రామారావు, కొల్లి అనుదీప్, సాయిభార్గవ్, బుగ్గవీటి గౌతం, పి. చంద్రశేఖర్, వినీష, అభిషేక్ దొంతుల, కురెల్లి పవన్‌కల్యాణ్ తదితరులు వైద్య సేవలందించారు. కేవీ రామిరెడ్డి, పగిడికత్తుల నాగేశ్వరరావు, మందడపు శ్రీనివాసరావు, తోట వెంకట్రావ్, కట్టెకోల వెంకన్న, ఈగా అనిల్‌కుమార్, ఇంటూరి అశోక్, మంకెనపల్లి నర్సింహారావు తదితరులు వలంటీర్లుగా సేవలందించారు.



శిబిరానికి పరీక్షల కోసం వచ్చిన ప్రజలు

మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మం రూరల్/ నేలకొండపల్లి / కూసుమంచి, మే 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదివారం పర్యటించారు. ఖమ్మం రూరల్ మండలంలోని పెద్ద తండా, కస్నాతండా, ఆరెకోడు తండా, తీర్థాల, తనగంపాడు, కాచిరాజుగూడెం, తదితర గ్రామాల్లో ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరిగిన శుభకార్యాల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కాచిరాజుగూడెం గ్రామంలో వివిధ పార్టీలనుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బండి జగదీష్, వెంకటరెడ్డి, మద్ది మల్లారెడ్డి, కేతినేని వేణు తదితరులు పాల్గొన్నారు.

వధూవరులను మంత్రి ఆశీర్వాదం

నేలకొండపల్లి మండల పరిధిలోని అమ్మగూడెం గ్రామానికి చెందిన పసుపులేటి సత్యనారాయణ అరుణల కుమార్తె చంద్రిక వివాహం ఆదివారం ఉదయం అమ్మగూడెం గ్రామంలోని సత్యనారాయణ గృహంలో జరిగింది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చంద్రిక, హరీష్‌ల వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వధువు తల్లిదండ్రులతో పాటుగా జిల్లా నాయకుడు నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవింద రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, అమ్మగూడెం మాజీ సర్పంచ్ గండు జానయ్య, అడపాల రామారావు, వేణు తదితరులు పాల్గొన్నారు.



కూసుమంచిలో వెంకట వీరమ్మకు నివాళులు అర్పిస్తున్న మంత్రి



అమ్మగూడెంలో వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి పొంగులేటి

మంత్రి పొంగులేటి పరామర్శ

కూసుమంచి మండలకేంద్రంలో ప్రముఖ వ్యాపారి బోనగిరి ఆంజనేయులును మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. ఇటీవల ఆంజనేయులు సతీమణి వెంకటవీరమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆంజనేయులును ఆయన కుమారుడు రాజేంద్రప్రసాద్‌ను ఓదార్చారు. మంత్రి వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు అనుకూలంగా ప్రభుత్వ నిర్ణయాలు

- ప్రభుత్వం ఇంజనీరింగ్ ఫీజుల పెంపు ఆలోచన విరమించుకోవాలి
- ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ



మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 18(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యను ప్రోత్సహించే విదంగా ఇంజనీరింగ్ విద్యార్థుల తల్లిదండ్రులకు కొలుకోలేని ఆర్థిక భారం పడేలా ప్రభుత్వ నిర్ణయాలు తీసుకుంటోందని, ఇంజనీరింగ్ విద్యలో ఫీజులు పెంపు ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం గిరిప్రసాద్ భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు మడుపల్లి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సంఘం జిల్లా సమితి సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ ఫీజులు పెంచుకునేందుకు కాలేజీలకు ప్రభుత్వం సహకరిస్తున్నదని ఆరోపించారు. నిబంధనల మేరకు ఆడిట్ ఆధారంగా ఫీజులు పెంచుకునే వెసులుబాటు ఉందని, ఆడిట్‌లోని కొన్ని అంశాలను ఆసరాగా చేసుకొని ఇష్టానుసారంగా కోర్సులను పెంచి ఇంజనీరింగ్ ఫీజులు పెంచేందుకు కొన్ని కాలేజీలు ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఇంజనీరింగ్ విద్యను పూర్తిగా కార్పొరేట్ విద్యగా మారుపోతుందన్నారు. ప్రతి సంవత్సరం 35శాతం నుంచి 75శాతం వరకు ఫీజులు పెంచుతున్నారని ఆరోపించారు. నిరుపేద, మధ్య తరగతి విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇష్టానుసారంగా ఫీజులు పెంచితే ఏఐఎస్ఎఫ్ తీవ్రంగా ప్రతిఘటిస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు శివ నాయక్, గోపి, ప్రతాప్, రాకేష్, పవన్, నరేందర్, ప్రసాద్ పాల్గొన్నారు.



స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

జీవితాంతం ప్రజా సమస్యలపై పోరాడిన పోటు ప్రసాద్

- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు
- స్మారక స్థూపం ఆవిష్కరణ

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 18(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం జీవిత కాలం పాటు పనిచేసిన నిబద్ధత కలిగిన నాయకుడు దివంగత పోటు ప్రసాద్ అని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మంలో పోటు ప్రసాద్ స్మారక స్థూపాన్ని బాగం హేమంతరావు ఆవిష్కరించారు. అంతకు ముందు జడ్పీ సెంటర్ నుంచి పోటు ప్రసాద్ స్థూపం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రసాద్ విద్యార్థి దశ నుంచి లౌకిక వామపక్ష భావజాలంతో పని చేశారన్నారు. తెలంగాణ పోరాటాన్ని వారసత్వంగా తీసుకున్న పోటు ప్రసాద్ ప్రజా సమస్యలు పరిష్కారానికి పోరాటమే మార్గమని నమ్మి తుది శ్వాస విడిచే వరకు పనిచేశారన్నారు. విద్యార్థి, కార్మిక నేత జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు బాధ్యతలు నిర్వహించారన్నారు. జిల్లా పార్టీ బాధ్యుడిగా పనిచేశారన్నారు. పార్టీ జెండాను జమ్ముల జితేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జానిమియా, టీజీ క్లైమెట్, పోటు కళావతి, మహ్మద్ సలామ్, మేకల శ్రీనివాసరావు, పోటు రాజాసాత్విక్, పగడాల మల్లేష్, యాకూబ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న తితిక్ష నాటిక

ఖమ్మం సాంస్కృతికం, మే 18 (ఆంధ్రజ్యోతి): నెలనెల వెన్నెల కార్యక్రమంలో భాగంగా ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆదివారం ప్రదర్శించిన తితిక్ష నాటిక ఆద్యంతం ప్రేక్షకులను ఆకట్టుకుంది. బీవీకే క్రియేషన్స్ కాకినాడ కళాకారులు ప్రదర్శించిన ఈనాటిక సహనం ప్రాధాన్యం వివరించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ సహనం కోల్పోవద్దన్న సందేశంతో కొనసాగిన ఈనాటిక రచన డి. ఉమాశంకర్, దర్శకత్వం డి. వినయ్‌కుమార్.. నటీనటులు తమ హావభావాలతో పాత్రలకు ప్రాణం పోశారు. నాటికకు ముందుగా జరిగిన సభలో జాబిశెట్టిపాపారావు, వంగవీటి నవీన్, కొండపల్లి జగన్మోహన్, నెలనెల వెన్నెల నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెరపై ప్రదర్శించిన లఘుచిత్రాలు మరింత ఆకట్టుకున్నాయి. పలు సామాజిక అంశాలతో నిర్మించిన షార్ట్ ఫిల్మ్ ప్రేక్షకులకు మంచి సందేశాన్నిచ్చాయి.

జిల్లా ఆస్పత్రిలో కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

ఖమ్మం కలెక్టరేట్, మే 18 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కొవ్వొత్తుల స్మారక దినాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. కళావతి బాయి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖమ్మం జిల్లాను హెచ్ఐవీ రహిత జిల్లాగా మార్చాలని అన్నారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారి పట్ల ప్రేమ చూపించి వారిని కూడా సమాజంలో అందరిలాగే గౌరవించాలన్నారు. హెచ్ఐవీతో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ లక్ష్మణరావు, మోహన్‌రావు, ఏఆర్టీ సిబ్బంది, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సిబ్బంది జాగృతి సిబ్బంది లింక్ వర్కర్స్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 18(ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఖమ్మం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని మామిళ్లగుడెంలో త్రైత సిద్ధంత జ్ఞాన గ్రంథాల గురించి ప్రచారం చేశారు. కులాలు అహేతుకం అని, మతాలు నిషిద్ధం అని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు కర్మ, యోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలని భగవద్గీత ప్రచారం చేశారు. జీవాత్మ, ఆత్మ పరమాత్మల గురించి తెలుసుకోవటమే త్రైతసిద్ధాంతం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యం, విజయ, ఉమేష్, మమత తదితరులు పాల్గొన్నారు.

త్రీ టౌన్ సీఐకి సన్మానం



సీఐని సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఖమ్మం ఖానాపురం హవేలి, మే 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని త్రీటౌన్ సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మోహన్‌బాబును ఆదివారం నగరంలోని బాలు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో చేస్తున్న సామాజిక సేవలను తెలుసుకోని సీఐ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగేంద్రబాబు, హెడ్ కానిస్టేబుల్ వరదబాబు, ట్రస్ట్ సభ్యులు ప్రవళిక, వేణు, సైదులు పాల్గొన్నారు.



జూబ్లీక్లబ్ వెనుక నివాసాల ముంపు



జూబ్లీపుర రోడ్‌నెం.3లో నీరు



ముంపు ప్రాంతంలో పర్యటించిన తుమ్మల(ఫైల్)

గోళ్లపాడు ముంపు ప్రాంతాలకు మహర్దశ

- వరద ఉధృతి తగ్గింపునకు అదనంగా కాల్వ
- 46వ డివిజన్‌కు రూ.2 కోట్లు మంజూరు చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- 200 నివాసాలకు తప్పనున్న వరద ముంపు
- త్వరలో కాల్వ పనులకు శంకుస్థాపన

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 18(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో కురిసిన వర్షపు వరద నీరు గోళ్లపాడు చానల్ కాల్వకు చేరి లోతట్టు ప్రాంతాల ప్రజల్ని ముంపునకు గురిచేస్తోంది. ప్రధానంగా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి జడ్పీసెంటర్, వైరా రోడ్డు, మయూరిసెంటర్ వరకు సమీప ప్రాంతాల వరద నీరు మామిళ్లగూడెం నుంచి కలెక్టర్ క్యాంపు కార్యాలయం ద్వారా గోళ్లపాడు చానల్ కాల్వకు చేరుతోంది. గత ప్రభుత్వంలో గోళ్లపాడు చానల్ ఆధునికీకరణ పేరుతో కాల్వ పైభాగాన్ని మూసివేశారు. దీంతో వరద ఉధృతికి గోళ్లపాడు చానల్ తట్టుకోలేక వరద ఉధృతి జూబ్లీపుర, సారథినగర్ ప్రాంతాల్లోని 200లకు పైగా నివాసాలపై ప్రభావం పడుతోంది. గతేడాది కురిసిన భారీ వర్షాలకు 46వ డివిజన్ ప్రాంతం ముంపునకు గురైంది. వారం క్రితం కురిసిన అకాల వర్షాలకు కూడా ఈ ప్రాంతం ముంపునకు గురైంది.

రూ.2కోట్లతో మరో కాల్వ

గతేడాది కురిసిన వర్షాలకు గోళ్లపాడు చానల్ కాల్వ సమీప ప్రాంత నివాసాలు ముంపునకు గురి కావటంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా పరిశీలించారు. ముంపునకు గోళ్లపాడు చానల్ ఆధునీకరణ పనులు అశాస్త్రీయంగా నిర్మాణం చేయటమే కారణంగా గుర్తించారు. దీంతో ప్రత్యామ్నాయంగా వరద ఉధృతిని తట్టుకునేలా మరో కాల్వను సారథి నగర్ నుంచి ఎఫ్‌సీఐ గోదాం వరకు నిర్మాణం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆలోచన చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమస్యను వివరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గోళ్లపాడు చానల్ కాల్వ పక్కన మరో కాల్వ నిర్మాణానికి రూ. 2 కోట్లు మంజూరు చేయించారు. పనులను త్వరలో మంత్రి తుమ్మల శంకుస్థాపన చేయనున్నారు. కాల్వ నిర్మాణం పూర్తి జరిగితే 200లకు పైగా నివాసాలకు ముంపు తీవ్రత తగ్గనుంది..

మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు..

కన్నం వైష్ణవి ప్రసన్న, కార్పొరేటర్, 46వ డివిజన్



గోళ్లపాడు చానల్‌ను అశాస్త్రీయంగా పనులు చేయటంతో వరద నీరు నివాసాల్లోకి చేరుతోంది. సమస్యను మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు తెలియజేయటంతో స్పందించారు. 46వ డివిజన్‌కు రూ.2కోట్లు కేటాయించారు. త్వరలో శంకుస్థాపన పనులు జరగనున్నాయి. ప్రత్యేక చొరవ తీసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు డివిజన్ ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు.

టెన్త్ టాపర్‌కు ఎంపీ వద్దిరాజు అభినందన

ఖమ్మం స్పోర్ట్స్, మే 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల పదో తరగతి పరీక్ష ఫలితాలలో 600 మార్కులకుగాను 592 మార్కులు సాధించిన నగరంలోని ఖానాపురంహవేలి అభయ వెంకటేశ్వరనగర్‌కు చెందిన ముత్యాల గోవర్ధన్, స్వప్నప్రియ దంపతుల కుమారుడు అఖిలేష్‌ను ఆదివారం రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అభినందించారు. ఈ సందర్భంగా అఖిలేష్‌ను శాలువాతో సత్కరించి ఆశీర్వదించారు. కష్టపడి మంచిగా చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అదిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆకుల గాంధీ, శీలంశెట్టి వీరభద్రం కనిశెట్టి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



అఖిలేష్‌ను అభినందిస్తున్న వద్దిరాజు

జిల్లాలో బలమైన శక్తిగా టీడీపీ: మల్లెంపాటి

తిరుమలాయపాలెం, మే18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బలమైన శక్తిగా టీడీపీ అవతరిస్తుందని ఆపార్టీ పాలేరు నియోజకవర్గ పరిశీలకుడు మల్లెంపాటి అప్పారావు , పాలేరు ఇన్‌చార్జి కొండబాల కరుణాకర్ తెలిపారు. ఆదివారం మండలంలోని పిండిపోలు పంచాయతీ శివారు పాపాయిగూడెంలో ఆపార్టీ మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయ శక్తిగా అవతరిస్తుందన్నారు. పార్టీ పూర్వవైభవానికి కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలన్నారు. కార్యకర్తల అభిప్రాయం మేరకు గ్రామాల్లో కమిటీలు ఏర్పాటుచేసి మండల కమిటీలు వేస్తామన్నారు. ఈకార్యక్రమంలో మల్లెంపాటి లహరిన్, బిక్షమయ్య, వెంకటరావు, నామా అప్పారావు, మల్లీడి రమేష్, వంగవీటి కృష్ణమూర్తి, పోట్ల కిరణ్, వీరెల్లి శ్రావణ్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో హైమాస్ట్ లైట్లు

ఖమ్మం కలెక్టరేట్, మే 18(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు అంధకారం రాజ్యమేలిన జిల్లా జనరల్ ఆస్పత్రిలో హైమాస్ట్ వెలుగులు వచ్చాయి. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఇటీవలె ఆస్పత్రిని సందర్శించిన సమయంలో రాత్రివేళల్లో చీకటిగా ఉంటుందని సిబ్బంది తెలుపడంతో స్పందించిన కలెక్టర్ మునిసిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో అభిషేక్ అగస్త్య ఆదేశాల మేరకు ఆస్పత్రిలో వివిధ ప్రాంతాల్లో 64 హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి ప్రారంభించడంతో వెలుగులు వెదజల్లాయి. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్. కిరణ్‌కుమార్ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, మునిసిపల్ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



ఆస్పత్రిలో వెలుగులు విరజిమ్ముతున్న లైట్లు



నేడు సింగరేణి, పేరుపల్లిలో ఫార్మర్ రిజిస్ట్రేషన్

కారేపల్లి మే 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పేరుపల్లి, సింగరేణి గ్రామపంచాయతీ పరిధిలోని పట్టాదారుపాస్‌పుస్తకం కలిగిన రైతులు సోమవారం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయశాఖాధికారి బట్టు అశోక్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం10:30 గంటలకు పట్టాదారుపాస్‌పుస్తకం, ఆధార్‌కార్డ్ జిరాక్స్‌లు, ఆధార్ కార్డ్‌కు అనుసంధానంగా ఉన్న మొబైల్‌ఫోన్ తీసుకుని రావాలన్నారు. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని లేదంటే కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ఏ పథకం కూడా వర్తించదన్నారు.

కార్పొరేట్‌ను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

▸▸ ప్రభుత్వం ఇంజనీరింగ్ ఫీజులు పెంపును విరమించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 18 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యను ప్రోత్సహించే విధంగా ఇంజనీరింగ్ విద్యార్థుల తల్లిదండ్రులకు కొలుకోలేని ఆర్థిక భారం పడేలా ప్రభుత్వ నిర్ణయాలు తీసుకుంటోందని, ఇంజనీరింగ్ విద్యలో ఫీజులు పెంపు ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం గిరిప్రసాద్ భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు మడుపల్లి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సంఘం జిల్లా సమితి సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ ఫీజులు పెంచుకునేందుకు కాలేజీలకు ప్రభుత్వం సహకరిస్తున్నదని ఆరోపించారు. నిబంధనల మేరకు ఆడిట్ ఆధారంగా ఫీజులు పెంచుకునే వెసులుబాటు ఉందని, ఆడిట్‌లోని కొన్ని అంశాలను ఆసరాగా చేసుకొని ఇష్టానుసారంగా కోర్సులను పెంచి ఇంజనీరింగ్ ఫీజులు పెంచేందుకు కొన్ని కాలేజీలు ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఇంజనీరింగ్ విద్యను పూర్తిగా కార్పొరేట్ విద్యగా మారుపోతుందన్నారు. ప్రతి సంవత్సరం 35శాతం నుంచి 75శాతం వరకు ఫీజులు పెంచుతున్నారని ఆరోపించారు. నిరుపేద, మధ్య తరగతి విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు శివ నాయక్, గోపి, ప్రతాప్, రాకేష్, పవన్, నరేందర్, ప్రసాద్ పాల్గొన్నారు.

అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ..ధాన్యం కొనుగోళ్లపై లేదు

▸▸ రైతు సంఘం నేత బొంతు రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా, మే 18 (ఆంధ్రజ్యోతి): మరో నెలరోజులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన ప్రకటన హాస్యాస్పదంగా ఉందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రపంచ సుందరీ పోటీల నిర్వహణపై ఉన్న శ్రద్ధ ధాన్యం కొనుగోళ్లపై లేదని విమర్శించారు. స్థానిక బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో ఫైడిపల్లి సాంబశివరావు అధ్యక్షతన ఆదివారం జరిగిన రైతుసంఘం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస ఏర్పాట్లు చేయలేదని, నెలలతరబడి రైతులు ధాన్యం అమ్ముకునేందుకు పడిగాపులు కాస్తున్నారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వడదెబ్బ తగిలి ధాన్యం రాశులపైనే రైతులు మరణిస్తున్నా ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేయడం లేదని, మంత్రులు ఎలాంటి శ్రద్ధ చూపటం లేదని విమర్శించారు. అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నా మంత్రులు సమీక్ష చేయటం తప్ప సమస్యలు పరిష్కరించడం లేదని ఆక్షేపించారు. మిల్లర్ల దయాదాక్షణ్యాలపైనే ఆధారపడి ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని ఆరోపించారు. మరో పదిరోజుల్లో నైరుతి రుతుపవనాలు వస్తాయని వాతావరణశాఖ ప్రకటించిన నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. నాయకులు చింతనిప్పు చలపతిరావు, సంక్రాంతి నర్సయ్య, హరి వెంకటేశ్వరరావు, కృష్ణమూర్తి, శివాజీ పాల్గొన్నారు.

శరవేగంగా కుడికాల్వ ఆధునీకరణ పనులు

వైరా, మే 18 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ కుడికాల్వ ఆధునీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆలస్యంగా పనులు ప్రారంభమైనప్పటికీ ప్రస్తుతం చురుగ్గా నడుస్తున్నాయి. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల్లో రెండోదశ ఆధునీకరణ పనులకు రూ.42.10కోట్ల నిధులను మంజూరు చేశారు. స్వయంగా ఆయనే పోయినేడాది ఆగస్టు 9న ఈ పనులకు శంకుస్థాపన చేశారు. అయితే గత ఏడాది ఖరీఫ్, రబీ వ్యవసాయ సీజన్ల దృష్ట్యా పనుల ప్రారంభంలో తీవ్ర జాప్యం జరిగింది. 'మిగిలింది రెండు నెలలే' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ఈ కాల్వపై కథనం ప్రచురితమైంది. ఆ వెంటనే అధికారుల్లో కదలిక వచ్చి పనులు ప్రారంభించేందుకు వేగాన్ని పెంచారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ఇంకా కేవలం నెలరోజుల వ్యవధి మాత్రమే ఉండటంతో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ కుడికాల్వలో తాటిపూడి వద్ద భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఇక అప్పటి నుంచి మూడు బిట్లుగా కుడికాల్వలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వైరా కుడికాల్వలో మొదటి దశ కింద 7.8కిలోమీటర్ల వరకు గైడ్ వాల్ నిర్మించారు. ఇప్పుడు 7.8కిలోమీటర్ నుంచి 20వ కిలోమీటర్ వరకు ఆధునీకరణ పనులు చేపట్టారు. 6.1కిలోమీటర్ దూరం గైడ్ వాల్స్, మరో 6.1కిలోమీటర్ దూరం లైనింగ్‌ను నిర్మించే పనులు జరుగుతున్నాయి. కేవలం పది రోజుల వ్యవధిలోనే 200మీటర్ల గైడ్‌వాల్స్ నిర్మాణం పూర్తయింది. నీటిపారుదలశాఖ వైరా డీఈ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏఈఈ వెంకట్రాములు ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు.



నిర్మించిన గైడ్‌వాల్స్

మారిన గైడ్‌వాల్స్ డిజైన్..

అందుబాటులో ఉన్న నిధుల మేరకు రెండో దశ ఆధునీకరణ పనుల్లో డిజైన్ మారింది. మొదటి దశ ఆధునీకరణ పనుల్లో గైడ్‌వాల్స్ నిర్మాణం సైజు ఒక రీతిలో ఉండగా ఇప్పుడు నిర్మిస్తున్న గైడ్‌వాల్స్‌లో కొంత మార్పులు జరిగాయి. మొదటి దశలో గైడ్‌వాల్స్ అడుగుభాగంలో మూడు అడుగుల నుంచి పైభాగంలో అడుగున్నర వెడల్పు, ఆరు అడుగుల ఎత్తుతో నిర్మించారు. అడుగుభాగంలో బెడ్‌కాంక్రీట్ వేశారు. అయితే ఇప్పుడు రెండోదశ గైడ్‌వాల్స్ అడుగుభాగంలో గతంలో మాదిరిగానే మూడు అడుగులు వెడల్పుతో నిర్మిస్తూ పైభాగంలోకి వచ్చేసరికి దాని వెడల్పును 8అంగుళాలకు కుదించారు. మూడు అడుగులు వెడల్పు నుంచి మధ్యలో రెండు అడుగుల వెడల్పు నుంచి స్లోప్ ఆకారంలో పైభాగం వచ్చేసరికి 8అంగుళాల వెడల్పుకే పరిమితం చేశారు. గైడ్ వాల్స్ ఎత్తు మాత్రం ఆరు అడుగులు, కాల్వలో రెండు గైడ్‌వాల్స్ మధ్య వెడల్పు 17.5అడుగులుగా నిర్మిస్తున్నారు. నిధుల లభ్యత మేరకే డిజైన్‌లో మార్పులు చేయాల్సి వచ్చిందని, ఈ గైడ్ వాల్స్ నాణ్యత, పటిష్ఠతలో ఎలాంటి సమస్య ఉండదని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు.

ఇంకా ప్రారంభం కాని ఎడమకాల్వ ఆధునీకరణ పనులు..

వైరా ఎడమకాల్వలో ఈ ఆధునీకరణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. కొద్దిరోజుల్లో ఈ పనులు కూడా మొదలు పెడతామని అధికారులు చెపుతున్నారు. మొదటి దశలో 9.5కిలోమీటర్ల గైడ్‌వాల్స్ నిర్మించారు. ఇక్కడి నుంచి గరికపాడు, లింగన్నపాలెం కాల్వలుగా ఎడమ కాల్వ విడిపోయింది. గరికపాడు వైపు వెళ్లే కాల్వలో 3.5కిలోమీటర్లు ఆధునీకరణ పనులు చేయాల్సి ఉంది. వీటిలో 1.75కిలోమీటర్లు గైడ్ వాల్స్, 1.75కిలోమీటర్ల దూరం లైనింగ్‌వాల్స్ నిర్మించాల్సి ఉంది. లింగన్నపాలెం బ్రాంచ్ కెనాల్‌లో ఒక కిలోమీటర్ దూరం గైడ్‌వాల్స్, ఒక కిలోమీటర్ దూరం లైనింగ్‌వాల్స్ పనులు మొదలు పెట్టాల్సి ఉంది. ఎడమకాలువ పనులు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.



జరుగుతున్న బెడ్ కాంక్రీట్ పనులు

విద్యుత్ స్తంభాలకున్న కేబుల్ వైర్లు తొలగించాలి



మాట్లాడుతున్న ఏడీఈ అనురాధ

మధిరటౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్థంబాలకు ఉన్న కేబుల్, ఇంటర్‌నెట్ వైర్లను వెంటనే తొలగించాలని విద్యుత్ మధిర సబ్ డివిజన్ ఏడీఈ అనురాధ కోరారు. ఆదివారం ఆమె తన కార్యాలయంలో విద్యుత్ సిబ్బందితో మాట్లాడుతూ.. మధిర పట్టణంలో విద్యుత్ స్తంబాలకు ఉన్న కరెంట్ తీగలకు సమాంతరంగా వివిద నెట్‌వర్క్‌లకు చెందిన కేబుల్ వైర్లు ఏర్పాటు చేశారని, ప్రమాదకర విద్యుత్ తీగల కింద ఈ వైర్లు ఉండడం ప్రమాదకరమన్నారు. విద్యుత్ సిబ్బంది స్తంబాలు ఎక్కేటప్పుడు కేబుల్ వైర్ల వల్ల అసౌకర్యం ఏర్పడుతుందని, ఒక్కోసారి ప్రమాదాలకు గురవుతున్నారని కావున కేబుల్ యజమాన్లు 24 గంటల్లో కేబుల్ వైర్లను తొలగించాలని లేని పక్షంలో తమ సిబ్బందే వాటిని తొలగిస్తారని తెలిపారు.

గౌడ జాతి అభివృద్ధి కోసం ఎల్లవేళలా సిద్ధం

▸▸ ఏపీ మాజీ మంత్రి జోగి రమేష్



పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జోగి రమేష్

పెనుబల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): గౌడ సామాజికవర్గం కోసం పనిచేసేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటానని ఏపీ మాజీమంత్రి జోగి రమేష్‌బాబు అన్నారు. ఆదివారం పెనుబల్లి మండలంలో ఆదివారం జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీఎంబంజర్‌లోని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శతాబ్దాల క్రితమే బహుజనులను ఏకం చేసి గోల్కొండ ఖిల్లాపై దండయాత్రతో జెండా ఎగురవేసిన స్ఫూర్తితో బహుజనులందరూ ముందుకు సాగాలన్నారు. గౌడ సామాజిక వర్గంతోపాటు ఇతర బీసీ బహుజనులందరిని కలుపుకొని ముందుకు సాగాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు కోటగిరి సుధాకర్‌రావు ఇంటి వద్ద విలేకరులతో మాట్లాడుతూ.. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో అధికారం చేపట్టిన నాయకులు అమలుకు సాధ్యం కాని వాగ్దానాలు ఇచ్చి ఇప్పుడు గత ప్రభుత్వాలు అప్పులు పాలుచేశారని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. ఆంధ్రా, తెలంగాణ ప్రజలు వీరికి ఎందుకు ఓటు వేశామని ఆవేదన చెందుతున్నారన్నారు. ఈ సందర్భంగా జోగి రమేష్‌బాబు అభిమాని చింతా అనిల్ ఆయనకు భారీ కార్ల ర్యాలీని నిర్వహించారు.


కృష్ణయ్యకు మాజీ ఎమ్మెల్యే నివాళులు



కృష్ణయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామానికి చెందిన సొసైటీ చైర్మన్ మామిళ్లపల్లి కృష్ణయ్య మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఘన నివాళులర్పించారు. ఈ మేరకు ఆదివారం కిష్టారంలో కృష్ణయ్య మృతదేహానికి సండ్ర పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్పు చేస్తూ సానుభూతి సంతాపం తెలిపారు. సండ్రతో పాటుగా కృష్ణయ్యకు నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు దొడ్డ శంకర్‌రావు, పర్వతనేని వేణు, నరకుళ్ల రాధకృష్ణ, కూసంపూడి మధు, కొల్లపనేని ధనుంజయ్, కె.అప్పారావు, మోరంపూడి కృష్ణ, శ్రీధర్, చింతనిప్పు సత్యనారాయణ, కె అశోక్, పి రాజు తదితరులు ఉన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల రక్తదానం



బిల్లుపాడులో రక్తదానం చేస్తున్న అభిమానులు

తల్లాడ, మే 18 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం బిల్లుపాడులో జూనియర్ ఎన్టీఆర్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదానం నిర్వహించారు. ప్రముఖ సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. రక్తదాన శిబిరాన్ని జక్కంపుడి చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదాతలకు పండ్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో రేగళ్ల శ్రీనివాసరావు, నారపోగు ప్రసాద్, సుబ్బారావు, విజయ్, నరేష్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య కళాశాలలో ఖాళీల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్

కారేపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రేలకాయలపల్లిలోని ఏకలవ్య మోడల్ కళాశాలల్లో ఇంటర్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ చేసుకుంటున్నట్లు ఏకలవ్య కళాశాల ప్రిన్సిపాల్ తన్నీరు నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల పరిధిలోని8 ఏకలవ్య కళాశాలల్లో 302 సీట్లు ఖాళీలను స్పాట్ అడ్మిషన్స్ ద్వారా భర్తీ చేయడం జరుగుతుందన్నారు. కారేపల్లి ఏకలవ్య కో ఎడ్యుకేషన్‌లో బాలికల విభాగంలో4, బైపీసీలో బాలుర విభాగంలో5, సీఈసీ గ్రూపులో బాలురు 9సీట్లు, బాలికలకు 15సీట్లు కలిపి మొత్తం 33సీట్లు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఖాళీ సీట్లకు ఈనెల 24న అన్ని ఏకలవ్య కళాశాలల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

గీత పారాయణంలో వైద్యురాలికి గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న శిరీష

కల్లూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి వెంకటాపురం గ్రామానికి చెందిన తోటకూర శిరీషకి భగవద్గీత పారాయణ పోటీల్లో గోల్డ్ మెడల్‌ను గణపతి సచ్చిదానందస్వామిజీ అందజేశారు. మైసూర్‌లో శనివారం జరిగిన ఈ పోటీల్లో ప్రతిభను కనబరిచినందుకు గాను శిరీష గోల్డ్‌మెడల్ అందుకున్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్



ప్రయాణికురాలు వెంకటమ్మకు స్మార్ట్ ఫోన్ అప్పగిస్తున్న కండక్టర్ ఉపేందర్

సత్తుపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి బస్సులో ఓ ప్రయాణికురాలు స్మార్ట్‌ఫోన్ పోగొట్టుకోగా అది కండక్టర్‌కు దొరకింది, నిజాయితీగా సదరు ఫోన్‌ను ఆదివారం బాధిత ప్రయాణికురాలికి అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఏపి 29 జడ్ 2079 నెంబర్ గల బస్సులో కొత్తగూడెం నుంచి సత్తుపల్లికి ప్రయాణిస్తున్న సిరికొండ వెంకటమ్మ తన వద్ద ఉన్న స్మార్ట్ ఫోన్ బస్సులో మర్చిపోయి సత్తుపల్లిలో దిగి స్వగ్రామం రేజర్ల వెళ్లిపోయింది. అందరూ దిగిన తర్వాత వెనక సీటు వరకు వెళ్లి చూసిన కండక్టర్ ఎం.ఉపేందర్(323705) సీటు కింద స్మార్ట్‌ఫోన్ ఉండడం గమనించాడు. ఇంటికి వెళ్లాక ఫోన్ లేదని గమనించిన ప్యాసింజర్ టికెట్లో ఉన్న స్టాఫ్ నెంబర్ ఆధారంగా కండక్టర్ను సంప్రదించగా తన వద్ద మొబైల్ ఉన్నదని చెప్పడంతో వెంకటయమ్మ సత్తుపల్లి డిపో వద్దకు వచ్చి టీఐ ఆనందం సమక్షంలో ప్రయాణికురాలు వద్ద ఆధార్ కార్డు చూపించడంతో ఆ ఫోన్‌ను ఆమేకు అప్పగించారు. ఆర్టీసీ యాజమాన్యానికి వెంకటమ్మ కృతజ్ఞతలు తెలిపింది.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

తల్లాడ, మే 18 (ఆంధ్రజ్యోతి): తల్లాడ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా కోడూరు నాగేశ్వరరావు ఎన్నికయ్యారు ఆదివారం తల్లాడ మండలం నారాయణపురంలో లయన్స్ క్లబ్ ప్రస్తుత అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు అధ్యక్షతన 2025-26 సంవత్సరానికిగాను లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు నూతన అధ్యక్షుడుగా కోడూరు నాగేశ్వరరావు, కార్యదర్శిగా నంబూరు కనకదుర్గ ప్రసాద్, కోశాధికారిగా అనుమోలు సర్వేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు కర్నాటి లక్ష్మారెడ్డి, దారా శ్రీనివాసరావు, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, బెల్లంకొండ అంజనేయులు, శీలం వెంకటరెడ్డి, మారెళ్ల వెంకటేశ్వరరావు, నున్నా చిన్న తిరుమలరావు, తోట మురళి, పొట్టేటి అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు



అధ్వానంగా రేలకాయలపల్లి, లక్ష్మీపురం రహదారి

కారేపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రేలకాయలపల్లి పంచాయతీ పరిధిలో రహదార్లు అధ్వానంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షం కురిసిన గ్రామంలోని రహదార్లు బురద మయంగ తయారువుతున్నాయని గ్రామస్తులు ఆవేధన వ్యక్తంచేస్తున్నారు. గ్రామల అబివృద్ధి కోసం కృషిచేస్తున్నామని ప్రజాప్రతినిధులు, మండల అధికారులు గొప్పలు చెబుతు ప్రజలను మభ్యపెడుతూ కాలం వేళ్ళ తీస్తున్నారని గ్రామస్తులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసిన గ్రామాలల్లోనే సీసీ రోడ్లు మంజూరు చేస్తున్నారని మారుమూల పంచాయతీ అయిన రేలకాయల పల్లిని పట్టించుకున్న నాథుడే లేడని వాపోతున్నారు. ఇప్పటికైన ఎమ్మెల్యే తమ గ్రామలలో రోడ్ల పరిస్థితి పరిశీలించి సీసీ రోడ్లు మంజూరు చేయలని ప్రజలు కోరుతున్నారు.

ప్రంపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు



చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ భక్తులు

కల్లూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని పెద్దకోరుకొండి గ్రామంలోని ఆర్సిఎం చర్చిలో ఆదివారం క్రైస్తవ భక్తులు ప్రపంచశాంతిని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత గురువులు జోజిబాబు బోధిస్తూ పరస్పరం ప్రతి ఒక్కరు ప్రేమ, స్నేహ భావాలతో మెలగాలని హితవు చెప్పారు. ప్రపంచదేశాల మధ్య స్నేహ బావం ఉన్నప్పుడే శాంతి నెలకొంటుందన్నారు. మానవ సమాజంలో అందరూ ఐక్యంగా జీవిస్తూ ఉండాలని కోరారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య శాంతి చర్చలు జరగాలిని ప్రార్థనలు చేశారు. ప్రపంచదేశాల్లో ఉగ్రవాదాన్ని అణిచేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు, వైబి పల్లి, పెద్దకోరుకొండి, చిన్నకోరుకొండి , టీ వెంకటాపురం, తదితర గ్రామాల నుంచి ఉపదేశకులు, సంఘస్థులు, యువతి యువకులు పాల్గొన్నారు

ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో ప్రసంగిస్తున్న చందర్ రావు

కల్లూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణ పరిధిలో ఆదివారం ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షునిగా ఎంపికైన వసుమర్తి చందర్‌రావు ప్రసంగిస్తూ జూన్ 8న కల్లూరులో తన పదవి ప్రమాణాస్వీకార కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ విచ్చేయనున్నారని చెప్పారు. ఆర్యవైశ్యుల సంఘపరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఈ సమావేశంలో నిర్ణయాలు తీసుకోవటం జరుగుతుందన్నారు. కల్లూరు డివిజన్ పరిధిలో గల ఆర్యవైశ్య సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో కురుస్తున్న భారీ వర్షం

సత్తుపల్లిలో భారీ వర్షం

సత్తుపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలో ఆదివారం ఒక్క సారిగా వాతావరణంలో మార్పు ఏర్పడింది. మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కారణంగా పట్టణంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఉదయం నుంచి తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదు కాగా మధ్యాహ్నానికి భారీ వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

కుప్పెనకుంట్ల వాసికి డాక్టరేట్



ఆళ్ల నారాయణరావు

పెనుబల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్పెన కుంట్ల గ్రామానికి చెందిన ఆళ్ల నారాయణరావు ఆంధ్రా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. సెరెబ్రోప్రొటెక్టివ్ అండ్ న్యూరోప్రొటెక్టివ్ స్టడీస్ ఆఫ్ సెలెక్టెడ్ ప్లాంట్ అనే అంశంపై మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పి.సుజాత పర్యవేక్షణలో ఈ పరిశోధన జరిపినందుకుగానూ ఆయనకు డాక్టరేట్‌ను అందజేశారు. నారాయణరావుకు డాక్టరేట్ రావడం పట్ల గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు కుర్నవల్లికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రాక

తల్లాడ, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్నవల్లి గ్రామంలో సోమవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పర్యటిస్తారని సీపీఎం తల్లాడ మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరావు తెలిపారు. సోమవారం సాయంత్రం కుర్నవల్లిలో జరిగే సీపీఎం వ్యవస్థాపకుడు పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతికి హాజరవుతరన్నారు.